ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక
MHR TV
మెదక్ సంపుటి: 19 సంచిక : 143 సోమవారం 26, జనవరి 2026 పేజీలు: 06 వెల: రూ.1
Circulated By: Hyderabad-Medak-Sangareddy-Nalgonda-Warangal-Nizamabad-Adilabad -Vijayawada-Guntur-Vizag-Kurnool | www.prajaswaramdaily.com

# పురపోరుకు రంగం సిద్ధం

కీలకమవుతున్న పురపోరు
మూడు పార్టీలకూ ముచ్చెమటలు
కాంగ్రెస్ లో వివాదాల వ్యవహారం
కేటీఆర్ కు సోదరి పోరు
కాషాయంలో అర్బన్ లొల్లి
బీసీ రిజర్వేషన్లపైనే అసలు కథ
42 శాతం ఇస్తామని హామీలు
ఇప్పటికే అధికారికంగా 32 శాతం
10 శాతం అదనంగా ఇచ్చేనా..?





**హైదరాబాద్, (ప్రజాస్వరం):**
రాష్ట్ర రాజకీయాల్లో పురపోరు కీలకంగా మారింది. పట్టణ ఓటర్ల నాడి ఎటువైపు ఉంటుందో తేలనున్నది. ప్రభుత్వంపై వ్యతిరేకత ఉందని బీఆర్ఎస్ గంపెడాశలు పెట్టుకుంది. గత ప్రభుత్వ వైఫల్యాలు, అక్రమాలకు తోడు తమ పాలనలో సంక్షేమ పథకాలపై అధికార కాంగ్రెస్ బల నిరూపణకు సిద్ధమవుతున్నది. ఇక, గ్రామాల్లో ఇంకా తమ ప్రాబల్యం పెంచుకోవాలని, పట్టణాల్లో మాత్రం తమదే ఆధిపత్యం అని కాషాయ దళం కాలరెగరేస్తున్నది. మూడు ప్రధాన పార్టీలు తమ పట్టుకోసం పట్టణ ఓటర్లను వలలో వేసుకునే ప్రయత్నాల్లో ఉంటే.. కొత్త పార్టీ పెడుతానంటూ ప్రకటించిన జాగృతి కవిత.. తాము ఓట్లు చీల్చుతామని, తమకు కూడా గెలుపు అవకాశాలున్నాయని, పార్టీ ఇంకా ఖరారు కాకపోవడంతో ఏదైనా గుర్తు మీద పోటీ ..మిగతా 2లో




# సింగరేణి స్కామ్‌లో సీఎం రేవంత్ సూత్రధారి

సీఎం రేవంత్ సూత్రధారని, ఆయన బావమరిది లబ్ధిదారుడని ఆరోపణ
సైట్ విజిట్ సర్టిఫికెట్ టెండర్లను రద్దు చేసి, సీబీఐ విచారణ జరపాలని డిమాండ్
సింగరేణి లాభాలను దాచిపెట్టి కార్మికుల బోనస్ తగ్గించారని విమర్శ
అవినీతిపై కేంద్రం మౌనం వీడాలని, బీజేపీ-కాంగ్రెస్ కుమ్మక్కయ్యాయని ఆరోపణ



**హైదరాబాద్, (ప్రజాస్వరం):**
సింగరేణి కాలరీస్‌లో భారీ అవినీతి జరిగిందని, దీని వెనుక సీఎం రేవంత్ రెడ్డి ఉన్నారని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు సంచలన ఆరోపణలు చేశారు. 'సైట్ విజిట్ సర్టిఫికెట్' నిబంధనతో జారీ చేసిన టెండర్లన్నింటినీ తక్షణమే రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఆదివారం మీడియాతో మాట్లాడిన ఆయన, ఈ కుంభకోణంపై జ్యుడీషియల్ లేదా సీబీఐ విచారణ జరపాలని కోరారు.
ఈ కుంభకోణానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డే సూత్రధారి అని, ఆయన బావమరిది సృజన్ రెడ్డి ప్రధాన లబ్ధిదారుడని ..మిగతా 3లో

## రైతు చెంతకే భూధార్..

సర్వే వ్యవస్థలో విప్లవం
క్షేత్రస్థాయిలోకి లైసెన్స్‌డ్ సర్వేయర్లు
పాత పద్ధతులకు స్వస్తి..
ఆధునిక 'రోవర్స్'తో కొలతలు
మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి


03

## సూర్య, అభిషేక్ విధ్వంసం..

మూడో టీ20లో న్యూజిలాండ్‌పై
8 వికెట్ల తేడాతో భారత్ ఘన విజయం
కేవలం 10 ఓవర్లలోనే 154 పరుగుల
లక్ష్యాన్ని ఛేదించిన భారత్



03

## ప్రపంచ పర్యాటక కేంద్రంగా తెలంగాణ

పెట్టుబడుల ఆకర్శణగా
తెలంగాణ టూరిజం పాలసీ
సీఎం రేవంత్ రెడ్డి



**హైదరాబాద్, (ప్రజాస్వరం):**
దేశ సంస్కృతి, సంప్రదాయాలు, చారిత్రక వారసత్వాన్ని ప్రపంచానికి చాటిచెప్పే గొప్ప మార్గం పర్యాటకమని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు. ఆదివారం జాతీయ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకొని ..మిగతా 2లో



## మెగాను కాపాడేందుకు హరీశ్ రావు పాట్లు

మెగా కృష్ణారెడ్డి కోసమే నైని టెండర్లు
ఈ వ్యవహారంలో సృజన్ రెడ్డి చిన్న చేప
అవినీతి తిమింగలానికి అన్యాయం జరుగుతుందని బీఆర్ఎస్ ఆవేదన
హరీశ్ రావును నమ్మి ఆయన కేటీఆర్ ప్రెస్ మీట్ పెట్టారు
నేను కాంగ్రెస్ లో చేరను
జాగృతి అధ్యక్షురాలు కవిత

**హైదరాబాద్, (ప్రజాస్వరం):**
బొగ్గు టెండర్ల వ్యవహారంలో పెద్ద తిమింగలం మెగాను కాపాడేందుకు మాజీ మంత్రి హరీశ్ రావు పాట్లు పడుతున్నారని జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆరోపించారు. తిమింగలం లాంటి కాంట్రాక్టర్ కు అన్యాయం జరుగుతుందని బీఆర్ఎస్ ఆవేదన చెందుతోందన్నారు. మెగా కృష్ణారెడ్డి కోసమే నైనీ టెండర్లు పెట్టారన్న ..మిగతా 3లో

## వికసించిన తెలుగు పద్మాలు

ప్రముఖ క్యాన్సర్ వ్యాధి నిపుణులు
'నోరి'కి వరించిన పద్మ భూషణ్
ఉభయ రాష్ట్రాలకు చెందిన
11 మందికి పద్మ శ్రీ పురస్కారాలు
తెలంగాణ నుంచి మామిడి
రామరెడ్డికి వరించిన పద్మశ్రీ
పశుసంవర్ధక, పాడి పరిశ్రమ విభాగాల్లో
అందించిన సేవలకు గుర్తింపు
సినీనటులు మురళీ మోహన్,
రాజేంద్ర ప్రసాద్ కు వరించిన అవార్డు
యూజీసీ మాజీ ఛైర్మన్ జగదీశ్ కుమార్‌కు
ఢిల్లీ కోటాలో పద్మశ్రీ



**హైదరాబాద్, (ప్రజాస్వరం):**
గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని కేంద్ర ప్రభుత్వం 'పద్మ'పురస్కారాలు ప్రకటించింది. ఐదుగురికి పద్మవిభూషణ్, 13 మందికి పద్మ భూషణ్, 113మందికి పద్మశ్రీ అవార్డులను ఆదివారం ప్రకటించింది. వీరిలో తెలంగాణ, ..మిగతా 2లో

## ఈ పురస్కారాలు రాబోయే తరాలకు గొప్ప స్ఫూర్తినిస్తాయి

తెలంగాణకు చెందిన ఏడుగురు
ప్రముఖులకు పద్మశ్రీ పురస్కారాలు
విజేతలకు శుభాకాంక్షలు తెలిపిన
బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
క్షేత్రస్థాయిలో పనిచేసే వారిని
గుర్తించడం అభినందనీయం అని ప్రశంస
మామిడి రామారెడ్డికి మరణానంతరం
పద్మశ్రీ రావడంపై హర్షం


02

# ప్రమాదం.. విషాదం

నాంపల్లి అగ్ని ప్రమాదంలో
ఐదుగురి సజీవ దహనం
మృతుల్లో ఇద్దరు చిన్నారులు
ఫర్నీచర్ షాపు
ఓనర్ సతీష్ బచా అరెస్ట్
మృతుల కుటుంబాలకు
రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా
22 గంటలు సాగిన రెస్క్యూ
పొగలతో సహాయకచర్యల్లో జాప్యం
భద్రతా ప్రమాణాలపై కఠినంగా
చర్యలు తీసుకోవాలని ఆదేశాలు



**హైదరాబాద్, (ప్రజాస్వరం):**
నాంపల్లిలో స్టేషన్ రోడ్డులో ఈ నెల 24న జరిగిన అగ్ని ప్రమాదం విషాదాన్ని మిగిల్చింది. ఓ ఫర్నీచర్ షాపులో చెలరేగిన మంటలు నాలుగు అంతస్తులకు వ్యాపించిన ఈ ప్రమాదంలో చాలా మంది ..మిగతా 3లో

# పురపోరులోనూ కాంగ్రెస్ దే విజయం

మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి
అన్నీ మున్సిపాలిటీలు
హస్తాగతం చేసుకుంటాం
నిజామాబాద్ లోకసభ
నియోజకవర్గ నేతలతో భేటీ



**హైదరాబాద్, (ప్రజాస్వరం):**
వచ్చే శాసనసభ ఎన్నికల్లోనూ అధికారం కాంగ్రెస్ పార్టీకే దక్కుతుందని రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి జోస్యం చెప్పారు. అంతకు ముందు త్వరలోనే జరగనున్న మున్సిపల్ ఎన్నికల్లోనూ గత ఎన్నికల ఫలితాలే వస్తాయని ధీమా వ్యక్తం చేశారు. గత కొంత కాలంగా బీఆర్ఎస్, బీజేపీలకు అనుకూలంగా ఉన్న నిజామాబాద్ లోనూ ఈ సారి స్థానిక కార్పొరేషన్ పై కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయమన్నారు. ఆదివారం నిజామాబాద్ లోకసభ నియోజకవర్గ పరిధిలోని నిజామాబాద్ కార్పొరేషన్, బోధన్, ఆర్మూర్, భీంగల్, మెట్పల్లి, కోరుట్ల పురపాలక సంఘాల పార్టీ సమన్వయ సమావేశాలకు ఉత్తమ్ కుమార్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాకా చేపట్టిన అభివృద్ధి, అమలు జరుపుతున్న సంక్షేమ కార్యక్రమాలు ప్రజలకు కాంగ్రెస్ పార్టీ మీద విశ్వసనీయతను పెంపొందించిందని ఆయన పేర్కొన్నారు. జరిగిన అభివృద్ధిని అమలుజరుగుతున్న సంక్షేమ ..మిగతా 2లో



# వికసించిన తెలుగు పద్మాలు

**మొదటిపేజీ తరువాయి**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు, ప్రముఖ క్యాన్సర్ వ్యాధి నిపుణులు నోరి దత్తాత్రేయుడు పద్మ భూషణ్ కు ఎంపికయ్యారు. అలాగే ముఖ్యంగా సైన్స్ అండ్ టెక్నాలజీ రంగం నుంచి గడ్డమణుగు చంద్రమౌళి, కృష్ణమూర్తి బాలసుబ్రహ్మణ్యన్, కుమారస్వామి తంగరాజ్, వైద్య రంగంలో గూడూరు వెంకట్ రావు, పాల్కొండ విజయానంద్ రెడ్డి, పశుసంవర్ధక రంగంలో మామిడి రామా రెడ్డి, కళా రంగం నుంచి దీపికా రెడ్డి, మురళీ మోహన్, రాజేంద్ర ప్రసాద్, గరిమెళ్ల బాలకృష్ణ ప్రసాద్ లకు పద్మ శ్రీ పురస్కారాలు వరించాయి. యూజీసీ మాజీ ఛైర్మన్ మామిడాల జగదీశ్ కుమార్‌కు ఢిల్లీ కోటాలో పద్మశ్రీ వరించింది. వివిధ రంగాల్లో విశేష సేవలు అందించిన 45 మందికి ప్రతిష్ఠాత్మక పద్మశ్రీ అవార్డులకు ఎంపిక చేయగా.. వాటిలో ఏపీ, తెలంగాణకు చెందిన 11 మందికి ఈ పురస్కారాలు వరించాయి. తెలంగాణకు చెందిన మామిడి రామరెడ్డికి పద్మశ్రీ అవార్డు వరించింది. పాడి, పశుసంవర్ధక విభాగాల్లో ఆయన చేసిన సేవలకు గుర్తింపుగా ఈ పురస్కారం ప్రకటించింది. తమిళనాడుకు చెందిన నటేశన్, హైదరాబాద్ లోని సీసీఎంబీలో పని చేస్తున్న డాక్టర్ కుమారస్వామి తంగరాజ్‌కు జన్యుసంబంధ పరిశోధనలకు వారిని పద్మశ్రీ అవార్డుకు ఎంపిక చేసింది. మానవ పరిణామ క్రమం, జన్యుసంబంధ వ్యాధులపై ఆయన పలు పరిశోధనలు చేసి, అంతర్జాతీయంగా గుర్తింపు పొందారు.

**పద్మవిభూషణ్**

ధర్మేంద్రకు మరణానంతరం పద్మవిభూషణ్
అచ్యుతానందన్(కేరళ)కు మరణానంతరం పద్మవిభూషణ్
కె.టి.థామస్(కేరళ)కు పద్మవిభూషణ్
సాహితీవేత్త పి.నారాయణన్(కేరళ)కు పద్మ విభూషణ్
కళల విభాగంలో ఎన్.రాజాం(ఉత్తరప్రదేశ్)కు పద్మవిభూషణ్

**పద్మభూషణ్**

ఝార్ఖండ్ మాజీ సీఎం శిబూసోరేన్‌కు పద్మ భూషణ్
క్రీడాకారుడు విజయ్ అమృతరాజ్‌కు పద్మ భూషణ్
ప్రజావ్యవహారాల విభాగంలో వి.కె.మల్హోత్రాకు పద్మభూషణ్
కళల విభాగంలో మమ్ముట్టి(కేరళ)కి పద్మ భూషణ్
ప్రముఖ క్యాన్సర్ వైద్యుడు నోరి దత్తాత్రేయుడుకు పద్మభూషణ్
గాయని ఆల్కా యాజ్ఞిక్(మహారాష్ట్ర)కు పద్మ భూషణ్
మాజీ గవర్నర్ భగత్‌సింగ్ కోశ్యారి(ఉత్తరాఖండ్) పద్మభూషణ్

**తెలుగు 'పద్మశ్రీ'లు**

సినీనటుడు మురళీమోహన్‌కు పద్మశ్రీ
సినీనటుడు రాజేంద్ర ప్రసాద్‌కు పద్మశ్రీ
ఏపీకి చెందిన గరిమెళ్ల బాలకృష్ణప్రసాద్‌కు పద్మశ్రీ
ఏపీకి చెందిన వేంపటి కుటుంబశాస్త్రి(సాహిత్యం)కి పద్మశ్రీ
తెలంగాణకు చెందిన గూడూరు వెంకట్రావు (వైద్యం)కు పద్మశ్రీ
తెలంగాణకు చెందిన కృష్ణమూర్తి బాలసుబ్రమణియన్(సైన్స్)కు పద్మశ్రీ
తెలంగాణకు చెందిన గడ్డమనుగు చంద్రమౌళి (సైన్స్ విభాగం)కి పద్మశ్రీ
తెలంగాణకు చెందిన దీపికారెడ్డి(నృత్యకారిణి)కి పద్మశ్రీ
తెలంగాణకు చెందిన పాలకొండ విజయ్‌ఆనంద్‌రెడ్డి(వైద్యం)కు పద్మశ్రీ
అంకె గౌడ (సాహిత్యం కర్ణాటక)
తంగరాజ్ (హైదరాబాద్ సీసీఎంబీ శాస్త్రవేత్త)
ఎస్‌జీ సుశీలమ్మ
సంగ్యుగామ్
షఫీ సాదిక్
శ్రీరంగ్ దేవబాలద్
శ్యామ్ సుందర్
సింహాచల్ పాత్రో
సురేశ్ హనఘవాడి
తాగరామ్ భీల్
తేచి గుబిన్
తిరువయ్యూర్ భక్తవత్సలం
విశ్వ బంధు
యమున్ జాత్ర సింగ్
అర్మిడ ఫెర్నాండెజ్ (మహారాష్ట్ర)
భగవాన్‌దాస్ రాయికర్ (మధ్యప్రదేశ్)
భిక్ల్యా లదక్య దిండా
బ్రిజ్‌లాల్ భట్ (జమ్ముకశ్మీర్)
బుద్రి తాటి
చరణ్ హెబ్రామ్
చిరంజి లాల్‌యాదవ్
ధార్మిక్‌లాల్ చునిలాల్ పాండ్య
గఫ్రుద్దీన్ మెవాటి జోగి
హాలీ వార్
ఇంద్రజిత్ సింగ్ సింధు
కె.పజనీవెల్
కైలాశ్ చంద్ర పంత్
ఖెమ్ రాజ్ సుంద్రియాల్
కొల్లాక్కయిల్ దేవకి అమ్మ జీ
మహేంద్ర కుమార్ మిశ్రా
మిర్ హాజీభాయ్ కసమ్‌భాయ్
మోహన్ నగర్
నరేష్ చంద్ర దేవ్ వర్మ
నీలేష్ వినోద్‌చంద్ర మండేవాలా
నూరుద్దీన్ అహ్మద్
ఒత్తువర్ తిరుత్తణి స్వామి నాథన్
పద్మ గుర్మీత్
పోహిలా లక్పెపి
పుణ్యమూర్తి నటేషణ్
ఆర్.కృష్ణన్
రఘుపత్ సింగ్
రఘువీర్ తుకారామ్ ఖేద్కర్
రాజస్తపతి కలిప్ప గౌండర్
రామకృష్ణారెడ్డి మామిడి
రామచంద్ర గాడ్‌బోలే సునీత గాడ్‌బోలే

# ప్రపంచ పర్యాటక కేంద్రంగా తెలంగాణ

**మొదటిపేజీ తరువాయి**

పర్యాటకులకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. సంస్కృతి, సంప్రదాయాలు, ఆచారాలపై అవగాహన పెంపొందించడంతో పాటు పర్యాటక రంగం ఆర్థికాభివృద్ధి, ఉపాధి అవకాశాల సృష్టి, ప్రాంతీయ అభివృద్ధి, జాతీయ ప్రతిష్ఠ, ప్రకృతి సంరక్షణకు ఎంతో తోడ్పడుతుందని సీఎం ప్రకటనలో పేర్కొన్నారు. దేశంలో తెలంగాణను అత్యంత ప్రాధాన్యత కలిగిన పర్యాటక గమ్యస్థానంగా నిలబెట్టాలన్న లక్ష్యంతో తెలంగాణ టూరిజం పాలసీ - 2025-30ను ప్రకటించామని తెలిపారు. ఆధ్యాత్మిక, వారసత్వ, సాంస్కృతిక, సాహస, వైద్య & వెల్నెస్, పర్యావరణ పర్యాటక రంగాల అభివృద్ధి ద్వారా పర్యాటకులను, పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా ఈ పాలసీని తీసుకొచ్చామని గుర్తుచేశారు. సురక్షిత పర్యాటకం, ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాల కల్పన, అవకాశాలున్న ప్రాంతాలను ప్రత్యేక పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధి చేయడం లక్ష్యంగా




తెలంగాణ టూరిజం పాలసీని ఆవిష్కరించామని అన్నారు. ప్రసిద్ధి చెందిన స్మారక చిహ్నాలు, చారిత్రక ప్రదేశాలు, పవిత్ర పుణ్యక్షేత్రాల గత వైభవం నుంచి రాష్ట్ర గుర్తింపును ప్రతిబింబించే ఉత్సవాలు, వంటకాలు, హస్తకళల వరకు తెలంగాణ ప్రత్యేకత స్పష్టంగా కనిపిస్తుందని తెలిపారు.

# పురపోరుకు రంగం సిద్ధం

**మొదటిపేజీ తరువాయి**

చేసి తమ సత్తా చూపిస్తామంటూ అంచనా వేస్తున్నారు. తనను ఏ పార్టీ నుంచి బయటకు పంపించారో.. అదే పార్టీ ఓట్లను చీల్చి తన బలం చూపించుకునేందుకు ప్లాన్ వేస్తోంది. ఇవన్నీ రాజకీయపరమైన అంశాలైతే.. మూడు ప్రధాన పార్టీలకు మాత్రం రిజర్వేషన్ల భయం పట్టుకున్నది.

**రాజకీయాల్లో కీలక ఘట్టం**

రాష్ట్ర రాజకీయాల్లో పుర పోరు కీలక అంశాలను బయటకు తీసుకురానున్నది. కాంగ్రెస్ పాలన రెండేళ్లు పూర్తయిన నేపథ్యం.. రాష్ట్ర రాజకీయ సమీకరణాలు మారుతున్న ఈ తరుణంలో జరగబోతున్న మునిసిపల్ ఎన్నికలు అటు అధికార కాంగ్రెస్ పార్టీకీ, ఇటు ప్రతిపక్ష బీఆర్ఎస్ కు అత్యంత కీలకమే. కేసీఆర్ రాజకీయ వారసుడు, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్.. రాజకీయ భవితవ్యానికి, కేసీఆర్ కుమార్తె, కేటీఆర్ సోదరి కల్వకుంట్ల కవిత పోషించబోయే పాత్రకు ఈ మున్సిపల్ ఎన్నికలు కీలకంగా మారబోతున్నాయని స్పష్టమవుతున్నది. రాష్ట్రంలో ఇప్పుడు 123 పురపాలికలకు రిజర్వేషన్లు ఖరారు అయ్యాయి. ఇందులో 117 మున్సిపాలిటీలకు అత్యంత త్వరగా షెడ్యూల్ విడుదలయ్యే అవకాశాలున్నాయి.

**పొలిటికల్ ఫ్యూచర్**

అసెంబ్లీ ఎన్నికల ఫలితాల తర్వాత ఇటీవల పంచాయతీ ఎన్నికలు, ఇప్పుడు మున్సిపల్ ఎన్నికలు సవాల్ గా మారుతున్నాయి. పంచాయతీ ఎన్నికల్లో ఒక విధంగా బీఆర్ఎస్ అనుకున్నంత ప్రభావాన్ని చూపించలేకపోయింది. అటు కాంగ్రెస్ కూడా తమదే ఆధిపత్యం అనే విధంగా నిరూపించుకోలేకపోయింది. బీజేపీ మాత్రం ఓ మూలన పడినట్లుగా మారిపోయింది. అయితే, పంచాయతీ ఎన్నికలు పార్టీ గుర్తుపై కాకపోవడంతో.. గెలుపు ఖాతాలు పార్టీల ఇష్టమే అన్నట్టుగా మారిపోయాయి. కానీ, అసెంబ్లీ ఎన్నికల తర్వాత మొదటి పెద్ద రాజకీయ పరీక్షగా ఈ మునిసిపల్ ఎన్నికలు నిలవనున్నాయి. ఎందుకంటే, ఈ ఎన్నికలు పార్టీ గుర్తుపైనే జరుగుతాయి.

**కేటీఆర్ కే సవాల్**

ప్రస్తుతం రాష్ట్రంలో రాజకీయ పరిస్థితులు ఎవరికీ అనుకూలంగా కనిపించడం లేదు. అధికార కాంగ్రెస్ కూడా కొంత భయంగానే ఉంది. ఇలాంటి సమయంలో గులాబీ పార్టీని తిరిగి క్షేత్రస్థాయి నుంచి బలోపేతం చేయాల్సిన బాధ్యత కేటీఆర్ పైనే ఉంది. పట్టణ ఓటర్లలో ఆ పార్టీ కోల్పోయిన నమ్మకాన్ని పునరుద్ధరించాల్సిన అవసరం కూడా పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కేటీఆర్ పైనే ఉంది. ఈ పరిస్థితుల్లో కాంగ్రెస్ ప్రభుత్వం మీద అసంతృప్తిని క్యాష్ చేసుకునే సామర్థ్యం కేటీఆర్ కేడర్ బలోపేతం చేయాల్సి ఉంది. ముఖ్యంగా పట్టణ ప్రాంతాల్లో బీఆర్ఎస్ గతంలో బలమైన పట్టు కలిగి ఉండేది. ఆ పట్టు ఇంకా కొనసాగుతోందా? లేక కాంగ్రెస్ వైపు మళ్లిందా? అన్నది ఈ ఎన్నికల్లో తేలనుంది. ప్రస్తుతం కేటీఆర్ వ్యూహాలు సరిగా రాజకీయంగా కలిసి వచ్చేలా లేవని సొంత పార్టీలోనే విమర్శలు వస్తున్నాయి. అటు కీలక నేతల నుంచి సపోర్ట్ కూడా తక్కువే అన్నట్టుగా ఉంది. కేవలం సోషల్ మీడియా ఆధారంగానే బీఆర్ఎస్ కొంత లాక్కుంటూ వస్తోంది.

**కవితతో గండమేనా..?**

ఈ పుర పోరులో కేసీఆర్ కుమార్తె కవిత కీలకంగా మారనున్నదా.. అంటే కొంత మేరకు అవుననే అభిప్రాయం రాజకీయ వర్గాల్లో వినిపిస్తోంది. మహిళా ఓటర్లపై కవిత ప్రభావం ఉండొచ్చని వారి అంచనా. పట్టణ మహిళా సమస్యలపై ఆమెకు ఉన్న గుర్తింపు, బీఆర్ఎస్‌లో కొత్త రాజకీయ దిశను సూచించే ముఖచిత్రంగా మారే అవకాశం లేకపోలేదు. ప్రత్యేకంగా మహిళా సంఘాలు, స్వయం సహాయక సంఘాలు, పట్టణ మహిళా ఉద్యోగులపై కవిత ఫోకస్ పెట్టే అవకాశం ఉంది. దీనికితోడు బీఆర్ఎస్ లోకి ఓ వర్గం కవితకు కలిసి వస్తుందనే టాక్ కూడా ఉంది. మహిళా భద్రత, మహిళల ఉపాధి అవకాశాలు, పట్టణాల్లో పెరుగుతున్న ధరలు, అధికమవుతోన్న జీవన వ్యయం, మహిళలకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన పథకాలు, కేంద్ర ప్రభుత్వ విధానాల వల్ల రాష్ట్రానికి జరుగుతున్న అన్యాయం, మహిళా దృక్పథంతో రాజకీయాలను చూడాలన్న అంశాన్ని కవిత ప్రధానంగా ముందుకు తెచ్చే అవకాశముంది. దీంతో కాంగ్రెస్‌కు, బీఆర్ఎస్ కు వ్యతిరేకంగా కవిత వ్యూహం కాస్త భిన్నంగా ఉండొచ్చని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

**'చేతి'కి చిక్కేనా..?**

అధికార కాంగ్రెస్ పార్టీకి తెలంగాణలో త్వరలో జరగబోయే మున్సిపల్ ఎన్నికలు సవాల్ గానే కనిపిస్తున్నాయి. పాత, కొత్త నాయకుల మధ్యనే విభేదాలు తారా స్థాయికి చేరాయి. ఇవన్నీ బహిరంగమవుతూనే ఉన్నాయి. ఇటు మంత్రుల మధ్య విబేదాలు కూడా కనిపిస్తూనే ఉన్నాయి. మున్సిపాలిటీల్లో గత పదిహేనేళ్లుగా కాంగ్రెస్ పార్టీని అట్టిపెట్టుకొని ఉన్న నేతలకు ఈసారి టికెట్లు ఇవ్వాలని పట్టుబడుతున్నారు. అయితే కొత్తగా పార్టీలోకి వచ్చిన వాళ్ళు తమకు హామీ మీదనే వచ్చామని.. కాబట్టి తమకే టికెట్లు ఇవ్వాలని అధిష్టానం మీద ఒత్తిడి చేస్తున్నారు. దీంతో ఆయా జిల్లాలకు ఇన్చార్జిలుగా ఉన్న మంత్రులకు ఇదో పెద్ద టాస్క్ అయిపోయింది.

ఇవే కాకుండా కొన్ని కీలకమైన హామీలు ఇంకా నెరవేరలేదు. దీంతో ఎక్కడ ఇవి తమకు మైనస్‌గా ఉంటాయనే భయం కూడా నెలకొంది. ఇప్పటికే పార్లమెంట్ సెగ్మెంట్ల వారీగా మంత్రులకు బాధ్యతలిచ్చారు. కానీ, అక్కడ సయోధ్య చేయడమే ఇప్పుడు మంత్రులకు ఉన్న అతి పెద్ద టాస్క్.

**కలవరం తప్పని కమలం**

మొన్న జరిగిన పంచాయతీ ఎన్నికల్లో కాషాయ దళం కానరాకుండా పోయింది. చాలాచోట్ల అభ్యర్థులు కూడా లేరు. ఇలాంటి సమయంలో ఈ పుర ఎన్నికలు బీజేపీకి అత్యంత ప్రతిష్టాత్మకంగా మారాయి. అర్బన్ లో తమకు తిరుగులేని పట్టు ఉందని చెప్పుకునే కమలం లీడర్లు.. క్షేత్రస్థాయిలో ఆ మాటను నిజం చేసి చూపించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఎంపీలు, ఎమ్మెల్యేల సొంత నియోజకవర్గాల్లోని మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో జెండా ఎగరేయడం కమలం నేతలకు అగ్నిపరీక్షగా మారింది. ఈ ఫలితాలు రాబోయే జీహెచ్ఎంసీ ఎన్నికలపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉండడంతో.. పార్టీ హైకమాండ్ ఈ పోరును సీరియస్‌గా తీసుకుంది. బీజేపీకి మొదటి నుంచి 'అర్బన్ పార్టీ' అనే ముద్ర ఉంది. అయితే మారిన రాజకీయ పరిస్థితుల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్ గట్టి పోటీ ఇస్తున్నాయి. ఈ నేపథ్యంలో టౌన్లలో తమ ఓటు బ్యాంకు చెక్కుచెదరలేదని నిరూపించుకోవాల్సిన బాధ్యత బీజేపీపై ఉంది. మున్సిపాలిటీల్లో మెజారిటీ స్థానాలను కైవసం చేసుకోకపోతే, అది బీజేపీ గ్రాఫ్ పడిపోవడానికి సంకేతంగా మారుతుందని వాదనలు ఉన్నాయి. దీంతో ఇప్పటి నుంచే క్షేత్రస్థాయిలో కేడర్‌ను లీడర్లు సమాయత్తం చేస్తున్నారు. ఈ ఎన్నికల్లో కరీంనగర్, నిజామాబాద్, మహబూబ్ నగర్ కార్పొరేషన్లు బీజేపీకి కీలకంగా మారాయి. కేంద్ర మంత్రి బండి సంజయ్ ఎంపీగా ప్రాతినిధ్యం వహిస్తున్న కరీంనగర్‌లో బీజేపీకి మంచి పట్టుంది. అసెంబ్లీ ఎన్నికల్లో ఆయన ఓడిపోయినా.. ప్రస్తుతం ఈ బల్దియాను గెలిచేందుకు వ్యూహరచన చేస్తున్నారు. నిజామాబాద్‌లో ఎంపీ అర్వింద్, అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ ఉన్నారు. సిట్టింగ్ ఎమ్మెల్యే, ఎంపీ ఉన్న చోట కార్పొరేషన్ చేజారితే అది పార్టీకి పెద్ద డ్యామేజ్ అవుతుంది. మరోపక్క ఎంపీ డీకే అరుణ ప్రాతినిధ్యం వహిస్తున్న పాలమూరులో సత్తా చాటాలని పార్టీ భావిస్తోంది. ఈ మూడు చోట్ల మేయర్ పీఠమే లక్ష్యంగా పార్టీ స్పెషల్ ఫోకస్ పెట్టింది. మంచిర్యాల, రామగుండంలో అంతో ఇంతో ప్రభావం చూపినా.. కొత్తగూడెంలో అంతంత మాత్రమే బీజేపీ ప్రభావం ఉంది.




**రిజర్వేషన్ల పరేషాన్..?**

రాజకీయంగా ఈ పరిస్థితి ఉంటే.. రిజర్వేషన్లు మరో కీలక అంశంగా పార్టీలకు మారింది. ఎందుకంటే బీసీలకు 42 శాతం రిజర్వేషన్లపై కాంగ్రెస్ పార్టీని పెట్టిన అసెంబ్లీ తీర్మానానికి మూడు పార్టీలూ ఆమోదం చెప్పాయి. ఒకడుగు ముందుకేసిన కాంగ్రెస్.. అధికారికంగా వీలుకాకుంటే పార్టీపరంగా 42 శాతం అమలు చేస్తామని ప్రకటించింది. దీనికి ఇటు బీఆర్ఎస్, బీజేపీ కూడా తామూ సిద్ధమే అనే సంకేతాలిచ్చాయి. ఫలితంగా ఇప్పుడు పార్టీ గుర్తుపై జరిగే ఎన్నికలు కావడంతో.. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల లెక్క చూపించాల్సిందే. అయితే, ఈసారి జనాభా ప్రాతిపదికన మున్సిపాలిటీల్లో బీసీలకు 32 శాతం రిజర్వేషన్లు దక్కాయి. పార్టీలు ఇచ్చిన హామీ ప్రకారం ఇంకో 10 శాతం ఇవ్వాల్సిందే. చాలాచోట్ల ఉన్నత వర్గాలు ఆశలు పెట్టుకున్న సీట్లన్నీ ఇప్పుడు బీసీ కోటాలోకి వెళ్లాయి. ఇంకా 10 శాతం బీసీలకు పార్టీపరంగా కేటాయిస్తే.. మరో 10 సీట్లు వదులుకోవాల్సిందే. జనరల్ స్థానాల్లో బీసీలను బరిలోకి దింపాల్సిందే. దీంతో మూడు పార్టీల్లోనూ విభేదాలు మొదలయ్యాయి. ఇటు అదనంగా 10 శాతం బీసీలకు ఇవ్వకుంటే వ్యతిరేకత కూడా వచ్చే అవకాశాలున్నాయి. మొత్తంగా రాజకీయ పార్టీలకు ఇటు రాజకీయ పరిస్థితులు, సవాళ్లు, సత్తా మాత్రమే కాదు.. రిజర్వేషన్ల గండం కూడా మున్సిపల్ ఎన్నికల్లో

## ఈ పురస్కారాలు రాబోయే తరాలకు గొప్ప స్ఫూర్తినిస్తాయి

- **తెలంగాణకు చెందిన ఏడుగురు ప్రముఖులకు పద్మశ్రీ పురస్కారాలు**
- **విజేతలకు శుభాకాంక్షలు తెలిపిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**
- **విభిన్న రంగాల్లోని ప్రతిభకు గుర్తింపు రావడం గర్వకారణమన్న కేటీఆర్**
- **మామిడి రామారెడ్డికి మరణానంతరం పద్మశ్రీ రావడంపై హర్షం**

**హైదరాబాద్, (ప్రజాస్వరం):**

కేంద్ర ప్రభుత్వం 2026 సంవత్సరానికి గానూ ప్రకటించిన ప్రతిష్ఠాత్మక పద్మ పురస్కారాల్లో తెలంగాణకు చెందిన ఏడుగురు ప్రముఖులకు పద్మశ్రీ అవార్డులు లభించడం పట్ల బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు హర్షం వ్యక్తం చేశారు. దేశవ్యాప్తంగా మొత్తం 131 మందికి పురస్కారాలు ప్రకటించగా, అందులో తెలంగాణ నుంచి వివిధ రంగాల్లో విశిష్ట సేవలు అందించిన వారికి సముచిత స్థానం దక్కడం రాష్ట్ర ప్రజలందరికీ గర్వకారణమని ఆయన కొనియాడారు.


ఈ సందర్భంగా కేటీఆర్ స్పందిస్తూ... సైన్స్, వైద్యం, కళలు, పశుసంవర్ధక వంటి భిన్న రంగాల్లో తెలంగాణ ప్రతిభ జాతీయ స్థాయిలో గుర్తింపు పొందడం ఎంతో సంతోషాన్నిచ్చిందన్నారు. సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగంలో చంద్రమౌళి గడ్డమానుగు, కృష్ణమూర్తి బాలసుబ్రహ్మణియన్, కుమారస్వామి తంగరాజ్‌లకు; వైద్య రంగంలో డాక్టర్ గూడూరు వెంకట్ రావు, డాక్టర్ పాలకొండ విజయ్ ఆనంద్ రెడ్డిలకు, కళల విభాగంలో కూచిపూడి నృత్యకారిణి దీపికా రెడ్డికి పద్మశ్రీలు దక్కాయని గుర్తుచేశారు. పశుసంవర్ధక రంగంలో విశేష సేవలు అందించిన మామిడి రామారెడ్డికి మరణానంతరం ఈ పురస్కారం ప్రకటించడం ఆయన నిస్వార్థ సేవకు దక్కిన నిజమైన గౌరవమని అభిప్రాయపడ్డారు.

క్షేత్రస్థాయిలో నిశ్శబ్దంగా సమాజం కోసం పనిచేసే వారిని గుర్తించి గౌరవించడం అభినందనీయమని కేటీఆర్ పేర్కొన్నారు. ఈ పురస్కారాలు కేవలం వ్యక్తులకు దక్కిన గౌరవంగానే కాకుండా, రాబోయే తరాలకు గొప్ప స్ఫూర్తినిస్తాయని ఆకాంక్షించారు. తెలంగాణ గడ్డపై పుట్టిన ప్రతిభావంతులు తమ తమ రంగాల్లో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించి, దేశ కీర్తిని మరింత ఇనుమడింపజేయాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. పురస్కార గ్రహీతలందరికీ, వారి కుటుంబ సభ్యులకు ఆయన హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు.

## 'పుర'పోరులోనూ కాంగ్రెస్ దే విజయం

**మొదటిపేజీ తరువాయి**

కార్యక్రమాలను ప్రజల్లోకి విరివిగా తీసుకపోయేందుకు కాంగ్రెస్ పార్టీ లీడర్, క్యాడర్ కృషి చేసేందుకు ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. రానున్న పురపాలక సంఘం ఎన్నికల్లో సత్తా చాటాలని ఆయన కాంగ్రెస్ పార్టీ శ్రేణులకు ఆయన పిలుపునిచ్చారు. ఈ మున్సిపల్ ఎన్నికల్లో ప్రతీ పురపాలక సంఘం మీద కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరడం ఖాయమన్నారు. పార్టీ నిర్వహిస్తున్న సర్వేల ఆధారంగా టికెట్లు ఖరారు చేస్తామన్నారు. సర్వేతో పాటు విధేయత, చిత్తశుద్ధి, క్రమశిక్షణ ల ప్రాతిపదికన అభ్యర్థుల ఎంపిక ఉంటుందని తెలిపారు. అవకాశం రాని వారికి ప్రత్యమ్నాయ అవకాశాలు కల్పిస్తామని ఆయన భరోసా ఇచ్చారు. పార్టీ కోసం శ్రమించే ప్రతీ ఒక్కరికీ అండగా ఉంటామన్నారు. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల శ్రమతో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో పార్టీ గెలుపులో భాగస్వామ్యం అయిన ప్రతి ఒక్కరికీ సముచిత స్థానం కల్పిస్తామన్నారు. అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం పట్టణ ప్రాంతాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. జరుగుతున్న అభివృద్ధికి మరిన్ని నిధులు మంజూరు చేసి పట్టణ ప్రాంతాలను అభివృద్ధి పరుస్తామన్నారు. కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విరివిగా తీసుకెళ్లాలన్నారు. అర్హులైన నిరుపేదలకు యావత్ భారత దేశంలోనే మొట్టమొదటి సారిగా నాణ్యమైన సన్నబియ్యం ఉచితంగా అందిస్తున్న ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కిందన్నారు.





# సూర్య, అభిషేక్ విధ్వంసం..

- **మూడో టీ20లో న్యూజిలాండ్‌పై 8 వికెట్ల తేడాతో భారత్ ఘన విజయం**
- **మరో రెండు మ్యాచ్‌లు మిగిలుండగానే 3-0తో సిరీస్‌ను కైవసం చేసుకున్న టీమిండియా**
- **అభిషేక్ శర్మ (68), సూర్యకుమార్ యాదవ్ (57) విధ్వంసక హాఫ్ సెంచరీలు**
- **కేవలం 10 ఓవర్లలోనే 154 పరుగుల లక్ష్యాన్ని ఛేదించిన భారత్**
- **బౌలింగ్‌లో రాణించిన బుమ్రా (3/17), రవి బిష్ణోయ్ (2/18)**

**హైదరాబాద్, (ప్రజాస్వరం):**

న్యూజిలాండ్‌తో జరుగుతున్న ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌ను టీమిండియా కైవసం చేసుకుంది. వరుసగా మూడు మ్యాచ్ లు గెలిచి అదరగొట్టింది. గువహటిలోని బర్సపరా క్రికెట్ స్టేడియం వేదికగా జరిగిన మూడో టీ20లో భారత్ 8 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. ఈ విజయంతో మరో రెండు మ్యాచ్‌లు మిగిలి ఉండగానే 30 తేడాతో సిరీస్‌ను సొంతం చేసుకుంది. తొలుత బౌలింగ్‌లో అదరగొట్టి కివీస్‌ను 153 పరుగులకే కట్టడి చేసిన భారత్, అనంతరం అభిషేక్ శర్మ, కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ విధ్వంసక హాఫ్ సెంచరీలతో కేవలం 10 ఓవర్లలోనే లక్ష్యాన్ని ఛేదించింది.

154 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్‌కు తొలి బంతికే షాక్ తగిలింది. ఓపెనర్ సంజూ శాంసన్ (0) డకౌట్‌గా వెనుదిరిగాడు. అయితే ఈ దశలో క్రీజులోకి వచ్చిన ఇషాన్ కిషన్ (13 బంతుల్లో 28), మరో ఓపెనర్ అభిషేక్ శర్మతో కలిసి ఎదురుదాడికి దిగాడు. వీరిద్దరూ కేవలం 19 బంతుల్లోనే 53 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పారు.

ఇషాన్ ఔటయ్యాక క్రీజులోకి వచ్చిన కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్, అభిషేక్‌తో కలిసి విధ్వంసం సృష్టించాడు. తన పరుగుల దాహాన్ని తీర్చుకుంటూ కివీస్ బౌలర్లపై విరుచుకుపడ్డాడు. సూర్య 26 బంతుల్లో 6 ఫోర్లు, 3 సిక్సర్లతో 57 పరుగులతో నాటౌట్‌గా నిలిచి జట్టును విజయతీరాలకు చేర్చాడు. అభిషేక్ శర్మ కూడా కేవలం 20 బంతుల్లోనే 7 ఫోర్లు, 5 సిక్సర్లతో 68 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. వీరిద్దరూ మూడో వికెట్‌కు అజేయంగా 40 బంతుల్లోనే 102 పరుగులు జోడించడం విశేషం. అంతకుముందు టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకున్న భారత్, కివీస్‌ను ఆది నుంచే దెబ్బతీసింది. భారత బౌలర్ల ధాటికి న్యూజిలాండ్ 34 పరుగులకే 3 కీలక వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఈ దశలో గ్లెన్ ఫిలిప్స్ (40 బంతుల్లో 48), మార్క్ చాప్‌మన్ (23 బంతుల్లో 32) నాలుగో వికెట్‌కు 52 పరుగులు జోడించి జట్టును ఆదుకునే ప్రయత్నం చేశారు. అయితే ఈ భాగస్వామ్యాన్ని రవి బిష్ణోయ్ విడదీయడంతో కివీస్ మళ్లీ కుప్పకూలింది. చివర్లో కెప్టెన్ మిచెల్ శాంట్నర్ (17 బంతుల్లో 27) కాస్త రాణించడంతో న్యూజిలాండ్ నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 153 పరుగులు చేసింది.

భారత బౌలర్లలో జస్ప్రీత్ బుమ్రా అద్భుతంగా బౌలింగ్ చేసి 4 ఓవర్లలో కేవలం 17 పరుగులిచ్చి 3 వికెట్లు పడగొట్టాడు. రవి బిష్ణోయ్, హార్దిక్ పాండ్యా చెరో రెండు వికెట్లు తీసి కివీస్ పతనాన్ని శాసించారు. బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో పూర్తి ఆధిపత్యం ప్రదర్శించిన టీమిండియా, సిరీస్‌ను కైవసం చేసుకుంది. నామమాత్రంగా మిగిలిన చివరి రెండు మ్యాచ్‌లలో బెంచ్ బలాన్ని పరీక్షించే అవకాశం ఉంది.

# రైతు చెంతకే 'భూధార్'..

- **సర్వే వ్యవస్థలో విప్లవం**
- **క్షేత్రస్థాయిలోకి లైసెన్స్‌డ్ సర్వేయర్లు**
- **పాత పద్ధతులకు స్వస్తి.. ఆధునిక 'రోవర్స్'తో కొలతలు**
- **మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**

**హైదరాబాద్, (ప్రజాస్వరం):**

రాష్ట్రంలో అన్ని రకాల భూములకు సంబంధించి ప్రతి అంగుళాన్ని డిజిటలైజ్ చేసి, యజమానులకు శాశ్వత యాజమాన్య భద్రత కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. గత ప్రభుత్వం 'ధరణి' ద్వారా సృష్టించిన చిక్కుముడులను విప్పుతూ.. రైతులకు చుట్టంలా ఉండేలా 'భూభారతి' చట్టాన్ని అమలులోకి తెచ్చామని ఆయన వెల్లడించారు. ఆదివారం ఖమ్మం కలెక్టరేట్ (ఐడీఓసీ)లో శిక్షణ పూర్తి చేసుకున్న లైసెన్స్‌డ్ సర్వేయర్లకు ఆయన ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గతంలోని టేపులు, గొలుసుల పద్ధతులకు స్వస్తి పలికి, సెంటీమీటర్ల తేడాతో ఖచ్చితత్వం వచ్చేలా 'రోవర్స్' సాంకేతికతను వాడుతున్నామని చెప్పారు. ఇప్పటికే ఆరొందల రోవర్లను కొనుగోలు చేసి జిల్లాలకు పంపిణీ చేస్తున్నట్లు వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా శిక్షణ పొందిన 5,500 మంది లైసెన్స్‌డ్ సర్వేయర్లను మండలాల వారీగా భూ విస్తీర్ణం ప్రాతిపదికన కేటాయించినట్లు వివరించారు. ఖమ్మం జిల్లాలో రెండో విడతలో అర్హత సాధించిన 47 మందికి నియామక పత్రాలు అందజేశామని, వీరంతా పారదర్శకతతో పనిచేయాలని సూచించారు. ధరణిలో జరిగిన లోపాలపై ఇప్పటికే సిరిసిల్ల, సిద్ధిపేట జిల్లాల్లో ఫోరెన్సిక్ ఆడిట్ పూర్తి చేశామని మంత్రి వెల్లడించారు. ఆ నివేదికలు ప్రభుత్వ పరిశీలనలో ఉన్నాయని చెప్పారు. త్వరలోనే రాష్ట్రవ్యాప్తంగా మిగిలిన 31 జిల్లాల్లోనూ ఆడిట్ నిర్వహిస్తామన్నారు. రిజిస్ట్రేషన్ల విషయంలో ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శల్లో వాస్తవం లేదని, ప్రభుత్వంపై బురద చల్లే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, ఖమ్మం మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్, గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు పాల్గొన్నారు.




# సింగరేణి స్కామ్‌లో సీఎం రేవంత్ సూత్రధారి

**మొదటిపేజీ తరువాయి**

హరీశ్ రావు ఆరోపించారు. నైనీ టెండర్‌ను రద్దు చేయడమే ఇందులో తీవ్ర అక్రమాలు జరిగాయనడానికి నిదర్శనమని అన్నారు. సీఎంకు సన్నిహితులైన కాంట్రాక్టర్లకు ప్రయోజనం చేకూర్చేందుకే టెండర్ నిబంధనలను మార్చారని విమర్శించారు.

జనవరి 2025లో ఎలాంటి సైట్ విజిట్ నిబంధన లేకుండా అంచనా వ్యయం కంటే 7 శాతం తక్కువకు ఖరారైన భూపాలపల్లి పనుల టెండర్లను, మూడు నెలల్లోనే మే 2025లో కొత్త నిబంధనలతో ఎందుకు జారీ చేశారని హరీశ్ రావు ప్రశ్నించారు. ఈ మార్పుల వల్ల పోటీ తగ్గి, సీఎం బంధువుకు చెందిన కంపెనీకి అంచనా కంటే ఎక్కువ ధరకు పనులు అప్పగించారని ఆరోపించారు. సైట్ విజిట్ సర్టిఫికెట్ విధానంతో మొదటి లబ్ధి పొందింది సృజన్ రెడ్డికి చెందిన 'శోధా కన్‌స్ట్రక్షన్స్' అని ఆయన పేర్కొన్నారు.






అవినీతిపై సూటిగా సమాధానం చెప్పకుండా, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సంబంధం లేని పత్రాలు చూపి ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని హరీశ్ రావు విమర్శించారు. కుంభకోణానికి బాధ్యులెవరు, ఎంత నష్టం వాటిల్లింది, ఎవరు లబ్ధి పొందారనే మూడు ప్రశ్నలకు ప్రభుత్వం సమాధానం చెప్పాలన్నారు. సింగరేణికి వచ్చిన సుమారు రూ. 6,900 కోట్ల లాభాలను కాంగ్రెస్ ప్రభుత్వం దాచిపెట్టి, కార్మికుల బోనస్‌ను తగ్గించిందని కూడా ఆయన ఆరోపించారు. సింగరేణిలో 49 శాతం వాటా ఉన్న కేంద్ర ప్రభుత్వం ఈ అవినీతిపై మౌనంగా ఉండటం అనుమానాలకు తావిస్తోందని, సింగరేణిని ప్రైవేటీకరించేందుకు కాంగ్రెస్, బీజేపీలు కలిసి పనిచేస్తున్నాయని విమర్శించారు.

# 'మెగా'ను కాపాడేందుకు హరీశ్ రావు పాట్లు

**మొదటిపేజీ తరువాయి**

ఆమె ఈ టెండర్ల అంశంలో సృజన్ రెడ్డి కేవలం చిన్న చేపనే అన్నారు. పవర్ మినిస్టర్ భట్టికి లేఖ రాయడానికి బీఆర్ఎస్ కు ఇబ్బంది ఏంటి అని నిలదీశారు. అసలు బీఆర్ఎస్ పాలనలో ఓబీసీలకు సైట్ విజిట్ విధానం లేదని సెటైర్ వేశారు. ఆదివారం బంజారాహిల్స్ లోని జాగృతి కార్యాలయంలో ఆమె మీడియాతో మాట్లాడారు. నైని కోల్ బ్లాక్ టెండర్ల విషయంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రెస్ మీట్ పెట్టగానే మా గుంట నక్క ప్రెస్ మీట్ పెట్టారని హరీశ్ రావును ఉద్దేశించి చెప్పారు. గుంట నక్క ప్రెస్ మీట్ ను గుడ్డిగా నమ్మి కేటీఆర్ ప్రెస్ మీట్ పెట్టారని వ్యాఖ్యానించారు. ఫోన్ ట్యాపింగ్ కేసు విషయంలో ప్రభుత్వం చేపడుతోన్న విచారణ రెండేళ్లుగా సాగుతూ 'కార్తీకదీపం' సీరియల్‌ను తలపిస్తోందని కవిత చురకలంటించారు. ప్రజల్లో ఇది హాస్యాస్పదంగా మారిందని ఎద్దేవా చేశారు. కేవలం ఎన్నికల లబ్ధి కోసమే ఈ అంశాన్ని తెరపైకి తెస్తున్నారని ఆరోపించారు. తీవ్రవాదుల కోసం వాడాల్సిన ట్యాపింగ్‌ను రాజకీయాలకు వాడటం సరికాదని సూచించారు. విచారణను సాగదీయకుండా వెంటనే బాధితులకు న్యాయం చేయాలని ఆమె డిమాండ్ చేశారు. కవిత కాంగ్రెస్ పార్టీలో చేరడానికి ఆసక్తి చూపుతున్నారనీ దానికి తాను వ్యతిరేకమంటూ టీపీసీసీ చీఫ్ చేసిన వ్యాఖ్యలపై కవిత స్పందించారు. ఎట్టిపరిస్థితుల్లోనే తాను కాంగ్రెస్‌లో చేరనని చెప్పారు. అసలు ఆ పార్టీ మళ్లీ అధికారంలోకి రాదని జోస్యం చెప్పారు.. మీరే జాగృతి పార్టీలో చేరండని మహేశ్ కుమార్ గౌడ్ కు సూచించారు. భవిష్యత్తులో తాను స్థాపించే పార్టీనే అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. అప్పుడు మహేష్ గౌడ్‌కు నా పార్టీలో కీలక పదవి ఇస్తానని వ్యాఖ్యానించారు.



# ఉపాధిహామీ పథకాన్ని పునరుద్ధరించాలి

- **విశ్వనాథం ఏఐసీసీ సెక్రటరీ**

**చేవెళ్ల, జనవరి 25(ప్రజాస్వరం):**

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని పునరుద్ధరించి, వీబీ జీ రామ్ జీ చట్టాన్ని తక్షణమే రద్దు చేయాలని ఏఐసీసీ సెక్రటరీ విశ్వనాథం డిమాండ్ చేశారు. గౌరవ టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ ఆదేశాలతో ఏఐసీసీ జనరల్ సెక్రటరీ మీనాక్షి నటరాజన్ పిలుపుమేరకు, సీఎం రేవంత్ రెడ్డి, సూచనలతో మహాత్మా గాంధీ ఉపాధి హామీ పథకం పేరు మారుస్తూ బీజేపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన వీబీజీరామ్‌జీ ఉపాధి హామీ పథకమునకు నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఆదివారం మొయినాబాద్ మండలంలోని తోల్కట్ట గ్రామంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చల్లా నరసింహా రెడ్డి, అధ్యక్షతన చేవెళ్ళ నియోజక వర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి పామేన భీమ్ భరత్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమాన్నిఉద్దేశించి విశ్వనాథం మాట్లాడుతూ.. ఆకలి చావులను దూరం చేయాడానికి తీసుకు వచ్చిన మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకాన్ని బీజేపీ ప్రభుత్వం సహించకనే దుర్మానికి పాల్పడిందని వారన్నారు. బొర్రా జ్ఞానేశ్వర్, మండల అధ్యక్షులు మానయ్య, తోల్కట్ట శంకర్ గౌడ్, రవీందర్ రెడ్డి, జైపాల్ రెడ్డి, వెంకట్ రెడ్డి, సత్యనారాయణ, బాల కృష్ణ రెడ్డి, శ్రీపాల్ రెడ్డి, మహిపాల్ రెడ్డి, నరేందర్ గౌడ్, వీరేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.





# ప్రమాదం.. విషాదం

**మొదటిపేజీ తరువాయి**

చిన్న చిన్న గాయాలై ప్రాణాలతో బయటపడగా.. ఆ మంటల్లో చిక్కుకున్న ఐదుగురు సజీవ దహనం అయ్యారు. ప్రమాదం జరిగిన వెంటనే రంగంలో దిగిన రెస్క్యూ బృందాలు. 22 గంటల పాటు సహాయక చర్యలు చేపట్టిన తర్వాత మృతుల సంఖ్యపై స్పష్టత వచ్చింది. చనిపోయిన వారిలో ఇద్దరు చిన్న పిల్లలు ఉన్నారు. గుర్తించిన అఖిల్ (7), ప్రణీత్ (11), హాబీబ్ (35), ఇంతియాజ్ (32), బేబీ (43) మృతదేహాలను గుర్తించిన పోలీసులు.. పోస్టుమార్టం నిమిత్తం వాటిని ఉస్మానియా ఆస్పత్రిలోని మార్చురీకి తరలించారు. మరో ప్రతి మృత కుటుంబానికి రూ.5 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా అందజేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ఈ మేరకు హైదరాబాద్ జిల్లా కలెక్టర్ హరిచందనకు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆదివారం ఆదేశాలు జారీ చేశారు. అలాగే భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అగ్నిమాపక నిబంధనలు, భద్రతా ప్రమాణాలపై కఠినంగా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. మరోవైపు ప్రమాదంపై చేపట్టిన ప్రాథమిక విచారణలో షాపు యజమాని నిర్లక్ష్యంతోనే అగ్నిప్రమాదం చోటు చేసుకున్నట్లు తేలింది. దీంతో ఫర్నీచర్ షాపు యజమాని సతీష్ బచాను అబిడ్స్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నిబంధనలకు విరుద్ధంగా, ఫైర్ సేఫ్టీ రూల్స్ పాటించకుండా సెల్లార్‌లో వ్యాపారం చేస్తుండటంతో కేసు నమోదు చేశారు. బాధ్యులపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

**22 గంటల రెస్క్యూ..**

హైదరాబాద్ లో అత్యంత రద్దీ ప్రాంతమైన నాంపల్లిలో శనివారం మధ్యాహ్నం భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. భవనం కింద ఉన్న సెల్లార్‌లోని హోల్‌సేల్ ఫర్నీచర్ షాపులో మొదట మంటలు ప్రారంభమయ్యాయి. లోపల ఫర్నీచర్ సామాగ్రి అధికంగా ఉండటంతో మంటలు వేగంగాపై అంతస్తుల వరకు వ్యాపించాయి. దట్టమైన పొగలు పరిసర ప్రాంతాలను కమ్మేయడంతో జనం పరుగులు తీశారు. ప్రమాద సమయంలో భవనంలో పలువురు చిక్కుకున్నట్లు వార్తలు రావడంతో ఒక్కసారిగా ఆందోళన నెలకొంది. అయితే, అగ్నిమాపక సిబ్బంది రాకముందే స్థానిక యువకులు సాహసించి భవనంలోకి వెళ్లి కొంత మంది పిల్లలను సురక్షితంగా బయటకు తీసుకువచ్చారు. భవనంలోని మిగిలిన కుటుంబాలను, పక్కనే ఉన్న రెసిడెన్షియల్ కాంప్లెక్స్‌లోని నివాసితులను అధికారులు వెంటనే ఖాళీ చేయించారు. అగ్ని ప్రమాదంలో చిక్కుకున్న వారిని వెలికి తీసేందుకు అగ్నిమాపక సిబ్బంది అన్ని విధాల ప్రయత్నించారు. ఆక్సిజన్ సిలిండర్‌తో సెల్లార్ లోకి వెళ్లారు. వీరివెంట వైద్య సిబ్బంది కూడా ఉన్నారు.

**ప్రముఖుల సంతాపం**

అగ్ని ప్రమాదంపై పలువురు రాజకీయ నేతలు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు సంతాపం తెలిపారు. ఈ విషాదం నుంచి వారు త్వరగా తేరుకోవాలని మనస్ఫూర్తిగా ప్రార్థిస్తున్నట్లు ప్రకటించారు. ఈ ప్రమాదంలో అమాయక ప్రజలు ప్రాణాలు కోల్పోవడం అత్యంత బాధాకరమని టీపీసీసీ చీఫ్, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ చెప్పారు. ప్రజల ప్రాణాలతో చెలగాటమాడే విధంగా భద్రతా ప్రమాణాలను పాటించకుండా వ్యాపారాలు నిర్వహించడం అత్యంత నేరమని పేర్కొన్నారు. భవిష్యత్‌లో ఇలాంటి దుర్ఘటనలు పునరావృతం కాకుండా సమగ్ర చర్యలు తీసుకోవాలని మహేష్ కుమార్ సూచించారు. ఫైర్ సేఫ్టీ నిబంధనలు పాటించని భవనాలు, సంస్థలు ఎక్కడైనా ఉంటే సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయాలని నగరవాసులను కోరారు. నిర్లక్ష్యంతో ఒక్క ప్రాణం కూడా పోకూడదన్నదే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని మహేష్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. అగ్నిప్రమాదం అత్యంత దురదృష్టకరమని మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు. ఈ ఘటనలో ఐదుగురు అమాయకులు ప్రాణాలు కోల్పోవడం తీవ్రంగా కలచివేసిందన్నారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అగ్నిమాపక నిబంధనలు, భద్రతా ప్రమాణాలపై కఠినంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను ఆదేశించినట్లు మంత్రి తెలిపారు. ప్రాథమిక విచారణలో షాపు యజమాని నిర్లక్ష్యం వల్లే ఈ అగ్నిప్రమాదం చోటు చేసుకున్నట్లు తేలిందని, సంబంధిత వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు వెల్లడించారు. బాధ్యులపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఫర్నీచర్ షాప్ లో జరిగిన అగ్ని ప్రమాదం పై హైదరాబాద్ ఇంచార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు సానుభూతి తెలిపారు. భవిష్యత్ లో ఇలాంటి ఘటనలు జరగకుండా జీహెచ్ఎంసీ,పోలీస్ ,రెవెన్యూ , హైడ్రా అధికారులు సమన్వయం చేసుకొని చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎక్కడైనా ఫైర్ సేఫ్టీ నిబంధనలు పాటించని భవనాలు ఉంటే పిర్యాదు చేయాలని కోరారు.

**మృతుల వివరాలు:**

బీ.బీ. అమ్మ
భర్త: లేట్ హుస్సేన్ ఖాన్
వయస్సు: 60 సంవత్సరాలు
నివాసం: కర్ణాటక
(వాచ్‌మన్ సమీర్ తల్లి)

అఖిల్
తండ్రి: యాదయ్య
వయస్సు: 7 సంవత్సరాలు
నివాసం: నాంపల్లి

ప్రణీత్
తండ్రి: యాదయ్య
వయస్సు: 11 సంవత్సరాలు
నివాసం: నాంపల్లి

మొహమ్మద్ ఇంతియాజ్
తండ్రి: మొహమ్మద్ యూసుఫ్
వయస్సు: 31 సంవత్సరాలు
నివాసం: నాంపల్లి

సయ్యద్ హబీబ్
తండ్రి: ముజీబుద్దీన్
వయస్సు: 30 సంవత్సరాలు
వృత్తి: ఆటో డ్రైవర్
నివాసం: శాస్త్రిపురం, రాజేంద్రనగర్

# ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధం

- ప్రతి ఒక్కరు ఓటు హక్కు వినియోగించుకోవాలి
- జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్

**మెదక్, జనవరి 25 (ప్రజా స్వరం) :**



ప్రజాస్వామ్యములో ఓటు హక్కు వజ్రాయుధమని, 18 సంవత్సరాలు పూర్తి అయిన ప్రతి ఒక్కరు ఓటరుగా నమోదు చేసుకొని తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. ఆదివారం మెదక్ జిల్లా కేంద్రంలోని మున్సిపాలిటీ కార్యాలయం నుండి బాలుర జూనియర్ కళాశాల మైదానం వరకు 16 వ జాతీయ ఓటర్ దినోత్సవాన్ని పురస్కరించుకొని ర్యాలీ నిర్వహించారు. కలెక్టర్ రాహుల్ రాజ్ దంపతులు పాల్గొన్నారు జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా జిల్లా అధికారులు, ఓటర్ల అందరిచే ఎన్నికల్లో ఎలాంటి ప్రలోభాలకు గురి కాకుండా స్వేచ్ఛగా తమ ఓటు హక్కు వినియోగించుకుంటామని ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం 16 వ జాతీయ ఓటరు దినోత్సవము సందర్భంగా కళాశాల మైదానం గ్రౌండ్లో నందు ఏర్పాటు చేసిన సమావేశములో కలెక్టర్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ఎంతో విలువైనదని అందరు ఓటు హక్కు ప్రాధాన్యతను గుర్తించాలని, ప్రతి ఒక్కరు ఓటు హక్కుపై అవగాహనా కలిపించికోవాలని సూచించారు. పద్దెనిమిది సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు ఓటరుగా నమోదు కావడంతో పాటు, ఎన్నికల్లో విధిగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. 18 సంవత్సరాలు పూర్తి అయిన ఎనిమిది మందికి ఓటు హక్కు కలిపిస్తూ బ్యాడ్జీలు పంపిణి చేశారు. ప్రజాస్వామ్యంలో 85 సంవత్సరాల నుండి ఓటు హక్కు వినియోగించుకున్న 03 మంది సీనియర్ సిటిజన్స్ కు ఈ సందర్భంగా శాలువా లతో సన్మానం చేశారు. ఓటరు అవగాహనా కార్యక్రమాలలో విస్తృతంగా పాల్గొని అత్యుత్తమ ప్రతిమ కనబరిచిన వారికి సర్టిఫికేట్ లు ప్రదానం చేసారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్, అదనపు ఎస్పీ మహేందర్, మెదక్ ఆర్ డి ఓ రమాదేవి, జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి,జిల్లా విద్యాశాఖ అధికారి విజయ, వ్యవసాయ అధికారి దేవకుమార్, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి ,ఇంటర్మీడియట్ అధికారి మాధవి, తాసిల్దార్ లక్ష్మణ్ బాబు, ఎన్నికల తాసిల్దార్ గఫార్, డీఎస్పీ ప్రసన్నకుమార్, జిల్లా పౌర సంబంధాల అధికారి రామచంద్ర రాజు, అన్ని శాఖల అధికారులు, ఉద్యోగులు, విద్యార్థిని విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.







# ఘనంగా ఆరే మరాఠి సంఘం కార్యాలయ ప్రారంభోత్సవం



**ఆదిలాబాద్ జిల్లా, జనవరి 25 ప్రజాస్వరం :**

ఇచ్చోడ మండల కేంద్రంలో ఆరే మరాఠి సంఘం కార్యాలయాన్ని ఘనంగా ప్రారంభించుకున్నారు... అడెగామా(బి) రోడ్డులో ఏర్పాటు చేసుకున్న సంఘం కార్యాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రారంభించుకున్నారు .. కుల పెద్దలు రిబ్బన్ కట్ చేసి కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆరే మరాఠి సంఘం ఇచ్చోడ అధ్యక్షులు సాయికిరణ్ జాధవ్,ఉపాధ్యక్షులు పాన్పట్టే సుభాష్, అశోక్ భోస్లే, పరమేశ్వర్ షిందే, తానాజీ థోరే, జనరల్ సెక్రటరీ పాడే అనిల్,కోశాధికారులు గైక్వాడ్ జ్ఞానేశ్వర్, మెండల్కర్ లక్ష్మణ్, జాయింట్ సెక్రటరీ చంద్రకాంత్ కదం, శ్యామ్ డుక్రే, దినేష్ గైక్వాడ్, కదం శంకర్, రాము జాధవ్, శివకాంత్ కదం , సభ్యులు పాన్పట్టే సాయికృష్ణ, సందీప్ కదం అడ్వైసర్ కమిటి సభ్యులు శంకర్ పాటిల్ ఖరే, సూర్యకాంత్ పాటిల్ చౌహాన్, మనోహర్ పాటిల్ డుక్రే, సుదర్శన్ పాటిల్ కదం,గంగాధర్ పాటిల్ షిందే అరుణ్ పాటిల్ అగ్లవే, కొండిరాం పాటిల్ కదం, కిషన్ పాటిల్ షిందే, జ్ఞానోబా పాటిల్ కదం తదితరులు పాల్గొన్నారు.

# ఓటర్ల దినోత్సవం భారీ చైతన్య ర్యాలీ



**మాసాయిపేట జనవరి 25 ప్రజాస్వరం :**

ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత పవిత్రమైనదని, దానిని ప్రతి పౌరుడు విధిగా వినియోగించుకోవాలని మాసాయిపేట తహసీల్దార్ జ్ఞాన జ్యోతి అన్నారు. 16వ జాతీయ ఓటర్ల దినోత్సవం ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించారు. తహసీల్దార్ ఆధ్వర్యంలో మండల నాయకులు, సర్పంచులు,విద్యార్థులతో కలిసి పట్టణ వీధుల్లో భారీ చైతన్య ర్యాలీ నిర్వహించారు. "ఓటు మన హక్కు దేశానికి బలం" అనే నినాదాలతో యువత ఉత్సాహంగా పాల్గొన్నారు.

# క్రీడాస్ఫూర్తిని పెంపొందించాలి



- సర్పంచ్ కుక్కల అండాలు రామాంజనేయులు
- ముఖ్యఅతిథిగా పాల్గొన్న బీజేపీ మండల అధ్యక్షుడు తిరుపతి రెడ్డి

**గజ్వెల్, జనవరి 25 (ప్రజాస్వరం) :**

గ్రామీణ యువకుల్లో క్రీడాస్ఫూర్తిని పెంపొందించడం కోసం పోటీలు దోహదపడతాయని బీజేపీ మండల అధ్యక్షుడు తిరుపతి రెడ్డి అన్నారు. వర్గల్ మండలంలోని సీతారాంపల్లిలో మెదక్, పార్లమెంట్ సభ్యులు రఘునాధన్ రావు పిలుపు మేరకు గ్రామస్థాయి క్రీడా పోటీలను ఆదివారం ప్రారంభించారు ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ కుక్కల అండాలు రామంజనేయులు మాట్లాడుతూ.. క్రీడలు శారీరకధారుడ్యంతో పాటు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయన్నారు. క్రీడలు శారీరక మానసిక వికాసానికి మార్గదర్శం కావలని, గెలుపు ఓటములు జీవితంలో భాగమేనని ప్రతి ఒక్కరూ క్రీడా ఉత్సాహాన్ని స్వీకరించాలన్నారు.ఈ ఉపసర్పంచ్ అజ్మీరచిరంజీవి, బూత్ అధ్యక్షుడు రేణు దాస్, వార్డ్ మెంబర్స్ క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా జాతీయ ఓటర్ దినోత్సవ ర్యాలీ



**చిన్న శంకరంపేట, జనవరి 25 ( ప్రజాస్వరం ) :**

ఓటు హక్కును వినియోగించుకోవడం ఒక హక్కు మాత్రమే కాదని దేశ భవిష్యత్తును తీర్చిదిద్దే శక్తి ఓటుకు ఉన్నదని ఎలాంటి ప్రలోభాలకు గురికాకుండా స్వచ్ఛందంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని తహశీల్దార్ మాలతి అన్నారు, చిన్న శంకరంపేట మండల కేంద్రంలో తహశీల్దార్ మాలతి ఆధ్వర్యంలో 16వ జాతీయ ఓటర్ దినోత్సవం సందర్భంగా స్థానిక తహశీల్దార్ కార్యాలయం నుండి మెదక్ చేగుంట రహదారి గుండా స్థానిక బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు, జాతీయ ఓటర్ దినోత్సవం పురస్కరించుకొని కార్యాలయం ముందు ముగ్గుల పోటీ నిర్వహించారు ముగ్గుల పోటీలో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు, అదేవిధంగా నలుగురు సీనియర్ సిటిజన్లను గుర్తించి శాలువాలతో సన్మానం చేశారు, ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులకు జాతీయ ఓటర్ దినోత్సవ పెన్నులను తహశీల్దార్ మాలతి చేతుల మీదుగా అందజేశారు, ఈ సందర్భంగా తహశీల్దార్ మాలతి మాట్లాడుతూ ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరు తప్పకుండా ఓటు హక్కును వినియోగించుకోవాలని ఎలాంటి ప్రలోభాల గురికాకుండా భయభ్రాంతులకు గురి కాకుండా తప్పకుండా తమ ఓటును వినియోగించుకోవాలని, నోట్ల కోసమో లిక్కర్ కోసమో ఓట్లను అమ్ముకోకూడదని ఆమె ఓటర్లకు సూచించారు, ఈ కార్యక్రమంలో తహశీల్దార్ మాలతి రెవెన్యూ ఇన్స్పెక్టర్ రాజు, జూనియర్ అసిస్టెంట్ శేషు, మధు, జిపిఓలు ఎల్లము, మహేష్, రాజు, కవిత, గీత, బి ఎల్ ఓ లు నాగరాణి, మాలతి, జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

# పరేడ్ రిహార్సల్స్ పరిశీలించిన అదనపు ఎస్పీ

**మెదక్, జనవరి 25 (ప్రజా స్వరం) :**



గణతంత్ర దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని ఆదివారం మెదక్ జిల్లా పోలీస్ కార్యాలయ ప్రాంగణంలోని పరేడ్ గ్రౌండ్లో పరేడ్ రిహార్సల్స్ నిర్వహించారు. ఈ రిహార్సల్స్ ను జిల్లా అదనపు ఎస్పీ మహేందర్ పరిశీలించారు. పరేడ్లో పాల్గొన్న పోలీస్ అధికారులు, సిబ్బంది క్రమశిక్షణ తో పాల్గొన్నారు. కార్యక్రమం సజావుగా నిర్వహించేందుకు అవసరమైన సూచనలు, భద్రతా ఏర్పాట్ల పై ఆయన మార్గదర్శకాలు అందించారు. గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా, సురక్షితంగా నిర్వహించేందుకు అన్ని విభాగాలు సమన్వయంతో పని చేయాలని అదనపు ఎస్పీ మహేందర్ సూచించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీలు ప్రసన్న కుమార్, రంగా నాయక్, సీఐ జార్జ్, ఆర్ఐ శైలేందర్, ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



# ఇసుక దొంగ హరీశ్ రావే





- పదేళ్లు మెదక్ ను దోచుకున్నారు
- ఎమ్మెల్యే రోహిత్ హయంలో మెదక్ అభివృద్ధి కి అడుగులు
- మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంత్ రావు

**మెదక్, జనవరి 25 (ప్రజా స్వరం) :**

మెదక్ లో హరీష్ రావు సిరిసిల్ల లో బావమరిది దోపిడి లు చేశారనీ మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు ఆరోపించారు. ఆదివారం మెదక్ పట్టణంలో బిఆర్ఎస్ సీనియర్ నాయకులు, మాజీ కౌన్సిలర్ లు మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు సమక్షంలో కాంగ్రెస్ లో చేరారు. ముందుగా మెదక్ పట్టణంలోని మాయ గార్డెన్ నుంచి వెంకటేశ్వర గార్డెన్ వరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ లో మైనంపల్లి హనుమంతరావు బుల్లెట్ నడుపుతూ పాల్గొన్నారు. అనంతరం బిఆర్ఎస్ సీనియర్ నాయకులు చింతల నర్సింలు తో పాటు పలువురు చేరడంతో మైనంపల్లి హనుమంతరావు కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మైనంపల్లి మాట్లాడుతూ ఇటీవల మెదక్ వచ్చిన హరీష్ రావు ఛాలెంజ్ చేసాడంట అసలు ఇసుక దొంగతనం చేసిందే హరీష్ రావు అని ఎద్దేవా చేశారు. సహకార సంఘం లో అక్రమాలు చేపట్టిన చరిత్ర మీదనీ..ఒక్కొక్కటి మీరు చేసిన అక్రమాలు బయటపెడతానని హెచ్చరించారు. గడిచిన పదేళ్ల లో మెదక్ లో ఉన్న ఆఫీసు లను సిద్దిపేట కు తీసుకునివెళ్ళి దోచుకోవడం జరిగిందని అన్నారు. సిరిసిల్ల లో దళితులు ప్రశ్నిస్తే థర్డ్ డిగ్రీ తో శిక్షించారనీ ఇంకా వారు కోలుకోలేదని వారు చేసిన అక్రమాలకు ఇది ఓ నిదర్శనమన్నారు. ఏడుపాయల ఆలయానికి, మెదక్ చర్చ్ కు కోట్ల రూపాయల నిధులు అందించింది సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఎమ్మెల్యే డాక్టర్ రోహిత్ చేసిన అభివృద్ధి కనిపించడం లేదా అని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో డిసిసి అధ్యక్షుడు ఆంజనేయులు గౌడ్, మాజీ మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్, యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పరశురామ్ గౌడ్, పట్టణ అధ్యక్షుడు గంగాధర్, నాయకులు హఫీజ్ ఉద్దీన్, మ్యాడమ్ బాలకృష్ణ, మధుసూదన్ రావు, రాగి అశోక్, బొద్దుల కృష్ణ, బొజ్జ పవన్ తదితరులు పాల్గొన్నారు.

## పురాతన కలలను కాపాడుకోవాలి





- చందపేట సర్పంచ్ నాయిని ప్రవీణ్ కుమార్

**చిన్నశంకరంపేట, జనవరి 25 ( ప్రజా స్వరం ) :**

చిన్నశంకరంపేట మండలం చందంపేట గ్రామంలో కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు నా గ్రామం నా వారసత్వం కార్యక్రమం చందంపేట గ్రామంలో సర్పంచ్ నాయిని ప్రవీణ్ కుమార్, ఉమామహేశ్వర భజన మండలి సభ్యులు ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. సర్పంచ్ ప్రవీణ్ కుమార్ భజన మండలి సభ్యులు యాదగిరి, గంగాధర్ మాట్లాడుతూ చందంపేట గ్రామంలో 100 సం నుంచి యక్షగానం భాగవతం నిర్వహిస్తున్నామని, మహాశివరాత్రి, సంక్రాంతి, ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని గ్రామంలో యక్షగాన కార్యక్రమాలు శావ నిర్వహణ, మరియు గ్రామంలో ఎవరైనా మరణిస్తే రాత్రి నుంచి ఉదయం వరకు భజన కార్యక్రమాలు చేస్తున్నామన్నారు. అలాగే గ్రామంలో పురాతన బురుజు పలకవర్గం సభ్యులు, గ్రామస్తులు కలిసి పరిశీలించారు. సర్పంచ్ ప్రవీణ్ మాట్లాడుతూ ప్రభుత్వం స్పందించి పర్యటక కేంద్రంగా తీర్చిదిద్దాలని గతంలో ఉన్నత అధికారులు బురుజు నలు మూలలు పరిశీలించి పర్యటక కేంద్రంగా ఏర్పాటు చేస్తామని అన్నారు. ఇప్పటివరకు మాటలు నీటి మూటల గడిచాయని ప్రస్తుత ప్రభుత్వం స్పందించి బురుజు అభివృద్ధి పరచాలని గ్రామస్తులు కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి పద్మ ,ఉపసర్పంచ్ నర్సింలు వార్డు సభ్యులు, భూపాల్, రామకృష్ణ, నర్సింలు, గౌతమి, లావణ్య, భజన మండలి సభ్యులు పెంట స్వామి సిద్ధిరాములు, రాములు, సంగయ్య, భూమయ్య, నారాయణ, పోచయ్య, లక్ష్మయ్య, కిష్టయ్య, నర్సింలు , పోచయ్య గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ చిత్తారమ్మ జాతరలో పాల్గొన్న ఎమ్మెల్యే మైనంపల్లి



**రామాయంపేట. జనవరి. 25 ( ప్రజాస్వరం) :**

మెదక్ జిల్లా రామాయంపేట పట్టణంలో కొనసాగుతున్న శ్రీ చిత్తారమ్మ జాతరలో ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు ఆదివారం పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ పూజారులు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే శ్రీ చిత్తరమ్మ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు ఎమ్మెల్యే రోహిత్ రావుకు శాలువా కప్పి తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ చిత్తరమ్మ దయతో ప్రజలందరూ బాగుండాలని అమ్మవారిని మొక్కుకున్నట్లు ఎమ్మెల్యే రోహిత్ రావ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ నిర్వాహకులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



**దౌల్తాబాద్, జనవరి25( ప్రజాస్వరం) :**

మండల పరిధిలోని మాచినపల్లి గ్రామంలో ఇటీవల నరమైన ఎల్లవ్వ మృతి చెందడంతో ఆమె కుటుంబానికి దుద్దెడ స్వామి ఆధ్వర్యంలో ఆర్థిక సహాయం అందజేశారు. ఆదివారం నాడు ఎల్లవ్వ కుటుంబానికి రూ.2,000/ నగదు సహాయంతో పాటు 25 కిలోల బియ్యాన్ని అందించారు. ఈ సందర్భంగా దుద్దెడ స్వామి మాట్లాడుతూ, ఇలాంటి కష్టకాలంలో బాధిత కుటుంబాలకు అండగా నిలవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. ఎల్లవ్వ కుటుంబానికి మాచినపల్లి గ్రామ ప్రజలు ఎల్లప్పుడూ తోడుగా ఉండాలని ఆయన కోరారు. గ్రామస్తుల సహకారంతోనే ఇలాంటి సేవా కార్యక్రమాలు కొనసాగించగలుగుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, స్థానికులు పాల్గొని బాయిత కుటుంబానికి తమ సంఘీభావాన్ని తెలియజేశారు.

## చిట్టోజిపల్లిలో వన్యప్రాణుల సమగ్ర లెక్కింపు



- డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ గీతా అగర్వాల్

**చేగుంట, జనవరి 25( ప్రజాస్వరం) :**

అఖిల భారత పులుల అంచనా జనగణన లో చివరి రోజు భాగంగా ఆదివారం మండలం లోని ఇబ్రహీంపూర్ బిట్ చిట్టోజిపల్లి అటవీ ప్రాంతంలో విస్తృతంగా నిర్వహించారు. ఈ జనగణన కార్యక్రమాన్ని డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ గీతా అగర్వాల్ ఆధ్వర్యంలో అటవీ శాఖ సిబ్బంది సమన్వయంతో విజయవంతంగా పూర్తి చేశారు. ఈ గణనలో పులులతో పాటు జింకలు, అడవి పందులు, నక్కలు, హైనా, కోతులు, కుందేళ్లు, ఉడుతలు, అలాగే నెమళ్లు, అడవి కోళ్లు, పావురాలు, గద్దలు, గుడ్లగూబలు వంటి పక్షి జాతులు, సర్పాలు, పాములు, ఉభయచరాలు సహా అన్ని రకాల వన్యప్రాణుల ఉనికి, సంఖ్య, సంచార మార్గాలను నమోదు చేశారు.వన్యప్రాణుల లెక్కింపులో పాదముద్రలు, మల విసర్జన, గోరు గుర్తులు, ఆహార అవశేషాలు, చెట్లపై గీతలు, నీటి వనరుల వద్ద కనిపించిన ఆనవాళ్ల ఆధారంగా అంచనా గణన చేపట్టారు. అటవీ ప్రాంతంలోని నీటి వనరులు, పచ్చిక మైదానాలు, చెట్ల సాంద్రత, జీవ వైవిధ్య పరిస్థితులను కూడా సమగ్రంగా పరిశీలించారు. గ్రామాలకు సమీపంగా వన్యప్రాణుల సంచారం ఉన్న ప్రాంతాలను గుర్తించి పంటలకు నష్టం జరిగే అవకాశాలు మానవ వన్యప్రాణి ఘర్షణలు నివారించేందుకు అవసరమైన సూచనలను నివేదికలో చేర్చారు. ఈ గణన ద్వారా అడవుల్లో జీవ వైవిధ్యం స్థితిగతులపై స్పష్టమైన అవగాహన లభించిందని అటవీ అధికారులు తెలిపారు.ఈ సందర్భంగా డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ గీతా అగర్వాల్ మాట్లాడుతూ 2026 గణనలో సేకరించిన సమాచారం వన్యప్రాణుల సంరక్షణ, అటవీ అభివృద్ధి, జీవ వైవిధ్య పరిరక్షణకు కీలకంగా ఉపయోగపడుతుందన్నారు. శాస్త్రీయంగా రూపొందించిన ఈ గణన భవిష్యత్తు ప్రణాళికలకు మార్గదర్శకంగా నిలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ ప్రణయ్ కుమార్, వాలంటీర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఆదర్శ గ్రామంలో స్వచ్ఛ భారత్



**తూప్రాన్ జనవరి 25 (ప్రజాస్వరం) :**

తూప్రాన్ మండలం మల్కాపూర్ ఆదర్శ గ్రామంలో 385 వ వారం స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని సర్పంచ్ ఆంజనేయులు గౌడ్ గ్రామంలోని 4,5,6 వ వార్డులలో చేపట్టారు. చెత్తాచెదారం తోపాటు పిచ్చి మొక్కలు, ప్లాస్టిక్ ను ఏరివేసి చీపురులతో శుభ్రపరిచారు. మేము సైతం అంటూ గ్రామంలోని చిన్నారులు శ్రమదానం లో పాల్గొని గ్రామస్తులలో మరింత ఉత్సాహాన్ని రేకెత్తించారు. ప్రతి ఆదివారం గ్రామంలో స్వచ్ఛభారత్ లో భాగంగా రెండు గంటలపాటు శ్రమదానం చేస్తున్నట్లు సర్పంచ్ పంజాల ఆంజనేయులు గౌడ్ పేర్కొన్నారు. అంతకుముందు 16వ జాతీయ ఓటర్ దినోత్సవాన్ని పురస్కరించుకొని గ్రామస్తుల చేత ఓటు హక్కు ప్రాధాన్యతపై ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ ఆంజనేయులు గౌడ్, మాజీ సర్పంచ్ మహాదేవి నవీన్ యాదవ్, ఉప సర్పంచ్ పల్లెపాటి స్వామి, వార్డు సభ్యులు, జిన్న కృష్ణ, పిట్ల వేణు,సరిత పరమేష్ , మన్నె తిరుపతి, జిన్న కృష్ణ, అంగన్వాడి టీచర్లు స్వర్ణలత, లావణ్య, ఆశ వర్కర్ ఇందిరా, వివో సంతోష,మేకిన్ యువత, పంచాయతీ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

## వడ్డేపల్లిలో స్వచ్ఛత కార్యక్రమాలు



- పరిశుభ్రమైన గ్రామమే అభివృద్ధికి పునాది

**వడ్డేపల్లి దౌల్తాబాద్, (ప్రజాస్వరం) :**

ప్రతి ఒక్కరూ తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని వడ్డేపల్లి గ్రామ సర్పంచ్ రాజా గారి రేణుక అన్నారు. స్వచ్ఛభారత్ కార్యక్రమంలో భాగంగా ఆదివారం గ్రామంలో విస్తృత స్థాయిలో పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రధాన వీధులు, అంతర్గత రహదారులు, డ్రైనేజీల వద్ద పేరుకుపోయిన చెత్త చెదారాన్ని గ్రామ పంచాయతీ సిబ్బంది, గ్రామస్తుల సహకారంతో తొలగించారు. అనంతరం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో సర్పంచ్ రేణుక మాట్లాడుతూ పరిశుభ్రమైన గ్రామమే అభివృద్ధికి పునాది అని పేర్కొన్నారు. గ్రామాభివృద్ధి ప్రభుత్వంతో మాత్రమే సాధ్యం కాదని, ప్రతి గ్రామస్థుడు బాధ్యతగా ముందుకు రావాల్సిన అవసరం ఉందన్నారు. ఇంటి ముందు చెత్త వేయకుండా నిర్ణీత ప్రదేశాల్లోనే చెత్తను వేయాలని సూచించారు. స్వచ్ఛత పాటిస్తే ఆరోగ్య సమస్యలు దూరమవుతాయని, గ్రామం మరింత అందంగా తీర్చిదిద్దబడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యురాలు సునంద, సి.ఏ. శోభతో పాటు పంచాయతీ సభ్యులు, పారిశుధ్య కార్మికులు, యువకులు పాల్గొన్నారు.

## దేశమా నీకు ఇదే వందనం

దేశమా నీకు ఇదే వందనం
గణతంత్ర మా నీకు ఘన స్వాగతం
ఈ దేశం నాది ఈ రాజ్యం నాది అని ప్రతి పౌరుడుకి
ఉండాలి
ప్రతి పౌరుడు సైనికుల పోరాడాలి!!

మూడు రంగుల జెండా మురిసిపోవాలి
భారతీయులంతా కలసి రావాలి
గణతంత్ర దినోత్సవ సంబరాలలో
మన దేశ ఖ్యాతి దిగంతాలు దాటాలే!!

నాటి నేతల స్ఫూర్తిని పునికి పుచ్చుకోవాలి
అభివృద్ధి బాటలో అడుగులు వేయాలి
భారతావని గుండెల్లో వెలుగులు నింపాలి
విజ్ఞాన గనిగా నింగినంటాలి
నా భారతదేశం!!

రచన :-
దేవులపల్లి రమేశ్
కలం: శ్రీ వర్ష
నంగునూర్,సిద్దిపేట
9963701294



# రాజ్యాంగాన్ని పాఠ్యాంశంగా ప్రవేశ పెట్టాలి

హైదరాబాద్ / కరీంనగర్ (ప్రజాస్వరం) :

భారతదేశం బ్రిటిష్ పాలన నుండి విముక్తి పొందిన తర్వాత స్వతంత్ర పరిపాలన వ్యవస్థ కొరకు 1930 సంవత్సరంలో ఇదే రోజున భారత జాతీయ కాంగ్రెస్ పూర్ణ స్వరాజ్ ప్రకటించిన రోజు జ్ఞాపకార్థంగా 26 జనవరి నాడు 77వ గణతంత్ర దినోత్సవాన్ని జరుపుకుంటున్నాం రాజ్యాంగబద్ధమైన పాలన ఈరోజు నుండి ప్రారంభమైంది . భారతదేశంలో ప్రజాస్వామ్య గణతంత్ర రాజ్యాంగా అవతరించిన రోజు. ప్రజలకు సార్వభౌమాధికారం స్వేచ్ఛ సమానత్వం సౌభ్రాతృత్వం రాజ్యాంగం పీఠికలో పొంద పరచడం జరిగింది. ఈరోజు రాజ్యాంగ విలువల గురించి స్మరించుకుంటారు. బ్రిటిష్ పరిపాలన చట్టాల స్థానంలో సొంత పాలన ప్రారంభమైంది. 2026 సంవత్సరం గణతంత్ర దినోత్సవ యొక్క థీమ్ వందేమాతరం ఆత్మనిర్భర్ భారత్ ఇతివృత్తంగా నిర్వహించడం జరుగుతుంది. 150 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ప్రభుత్వం వందేమాతర గీతం జాతి విముక్తి పై కలిగించిన ప్రభావాన్ని రిపబ్లిక్ డే లో ప్రత్యేకంగా ప్రదర్శిస్తారు ప్రజాస్వామ్య స్ఫూర్తి ప్రజలే ప్రభువులు అన్న సూత్రంతో అధికార పీఠం అత్యున్నత స్థానంప్రజలకు( ఓటర్లకు) రాజ్యాంగంలో ఇవ్వడం జరిగింది ప్రజాస్వామిక విధానాలే దేశానికి శరణ్యం. రాజ్యాంగం ప్రజాస్వామ్య స్ఫూర్తికి పునాదిగా నిలిచింది.

**రాజ్యాంగంపై అవగాహన కల్పించాలి**

ప్రభుత్వం విద్యా సంస్థల్లో ప్రాథమిక స్థాయి నుండి 'పీ'జీ స్థాయి వరకు రాజ్యాంగాన్ని పాఠ్యాంశంగా ప్రవేశ పెట్టి రాజ్యాంగంపై అవగాహన కలిగించాలి.

భారత రాజ్యాంగం ఉనికిలోకి వచ్చి77 సం" రాల సందర్భంగా గణతంత్ర దినోత్సవం జరుపు కుంటున్నప్పటికి జన బాహుళ్యంలోకి రాజ్యాంగం గురించి ప్రచారం చేయడం అవగాహన కల్పించడంలో కేంద్ర 'రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమైనాయి.

హక్కులు పరిపాలన చట్టాల మీధ అవగాహన కల్పించాలి

రాజ్యాంగంలోని అంశాలు స్థానిక' రాష్ట్ర :కేంద్ర ప్రభుత్వాల ఏర్పాటు పరిపాలన చట్టాలు మానవ హక్కులు'ప్రాథమిక హక్కులు ఆదేశిక సూత్రాలు రాష్ట్ర' కేంద్ర జాబితా ఉమ్మడి జాబితాలోని అంశాలుమరియు సూక్ష్మ స్థూల స్థాయి ఆర్థిక ప్రణాళికల అమలు అధికార వికేంద్రీకరణ మొదలగు అంశాల పై అవగాహన చైతన్యం కలిగించాలి. సామాజిక భద్రత చట్టాలపట్ల ప్రజలకు అవగాహన కలిగించే ప్రయత్నం జరుగలేదు.

రాజ్యాంగం బ్రహ్మ పదార్థం

రాజ్యాంగం అంటే ఎవ్వరికీ అర్థం కాని బ్రహ్మపదార్థం ఐయ్యింది.రాజ్యాంగ మంటే అంబేడ్కర్ రచించాడు అని మాత్రమే చాలా మందికి తెలుసు.

రాజ్యాంగాన్ని ఉచితంగా పంపిణీ చెయ్యాలి

రోడు మీద! భగవద్గీత' బైబిల్' కురాన్ మత గ్రంథాలను ఉచితంగా లేదా తక్కువ ధరలకు అమ్మి నట్లు రాజ్యాంగాన్ని వాడుక బాషలో ప్రింట్ చేసి ప్రజలకు ఉచితంగా పంచిపెట్టాలి.

మీడియా కళారూపాల ద్వారా అవగాహన కల్పించాలి

విద్యాసంస్థల్లో కళాశాలలో రాజ్యాంగ పట్ల అవగాహన చైతన్య సదస్సులు చర్చా గోస్టులు నిర్వహించాలి .వివిధ సామాజికమాధ్యమాలద్వారా కళారూపాల ద్వారా వాడుక బాషలో నాటకాల ప్రదర్శన ద్వారా గ్రామీణులకు రాజ్యాంగం పట్ల అవగాహన కలిగించాలి. ఇటీవల రాజ్యాంగం మార్చాలని రద్దుచేయాలని కొత్త రాజ్యాంగం రూపొందించాలని జాతీయ స్థాయిలోచర్చలు వాదోపవాదాలు జరుగుతున్నాయి.

**రాజ్యాంగబద్ధమైన పాలన విఫలం**

78 సం" రాల స్వాతంత్ర్య చరిత్ర లో అధికారంలో వున్న పార్టీలు ప్రభుత్వాలు రాజ్యాంగ బద్ధంగా పాలనా వ్యవహారాలను నిర్వహిస్తే ఆశించిన ప్రజా సంక్షేమం సామాజిక ఆర్థిక ప్రగతి సిద్ధించేది. నిజానికి రాజ్యాంగం గురించి తెలిస్తే ప్రజలు పాలకులను ప్రభుత్వ అధికారులను ప్రశ్నిస్తారు.

సుపరిపాలన లో వైఫల్యం

రాజకీయ పార్టీలు అధికారంలో వున్న ప్రభుత్వాలకుపాలకులలో/ పారదర్శకనికత జవాబు దారీతనం లోపించింది . మాయమాటలతో ప్రజల దృష్టి మళ్లించడం ప్రజలు ప్రశ్నిస్తారనే నెపంతో పాలకులు ప్రజలవద్దకు సుపరి పాలన అందిచడంలో విఫలకావడం శోచనీయం. ప్రజాస మస్యల పరిష్కారదిశగా దృష్టి పెట్టకుండా ప్రజలను మాయ మాటల ప్రపంచం లోకి నెట్టి వేస్తూ కాలయాపన చేస్తున్నారు. దేశంలో కొంత మంది మేధావులకు మాత్రమేరాజ్యాంగం మీద అవగాహన వుంది..దేశంలోరాజ్యాంగంపై సంపూర్ణ అవగాహనవున్న అడ్వకేట్స్ సంఖ్య కొద్దిగానే వుంది.

రాజ్యాంగం పై శిక్షణ ఇవ్వాలి

రాజకీయ పార్టీలు తమ కార్యకర్తలకు రాజ్యాంగం చట్టాల పట్ల.శిక్షణ అవగాహన తరగతులు నిర్వహించాలి . రాజ్యాంగ పరిజ్ఞానం వున్న అభ్యర్థులకు ఎన్నికల్లో టికెట్లు ఇవ్వాలి .

**జాతీయ స్థాయిలో అర్హత పరీక్ష నిర్వహించాలి**

జాతీయ స్థాయిలో పొలిటికల్ సర్వీస్ కమీషన్ ఏర్పాటు చేసిఆల్ ఇండియా స్థాయిలో రాజకీయాల్లో ప్రవేశించే అభ్యర్థులకు ఎలిజిబిలిటీ పరీక్ష నిర్వహించాలి. (లాసెట్ ఎంసెట్ మాదిరి) అర్హత పరీక్షలో పాసైన అభ్యర్థులు మాత్రమే చట్టసభలకు సభ్యులుగా పోటీ చేసేట్లు రాజ్యాంగాన్ని సవరించాలి.

**కుటుంబమే రాజ్యాంగ అవగాహనకు కేంద్రం కావాలి**

ప్రతి కుటుంబాన్ని యూనిట్ గా తీసుకోనితల్లి తండ్రులు తమ పిల్లలకు రాజ్యాంగం మీద అవగాహనకలిగించాలి

**విద్యార్థి సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలి**

ప్రభుత్వం విద్యాసంస్థల్లో కళాశాలల్లో యూనివర్సిటీల్లో విద్యార్థి సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలి. విద్యార్థి దశలోనే ప్రజాస్వామ్యం రాజ్యాంగం మానవ హక్కులు విధులు ప్రజాస్వామ్య ప్రక్రియ పైన అవగాహన చైతన్యం కలిగించాలి. విద్యార్థి రాజకీయాల్లో రాణించిన వారు జాతీయ స్థాయి నాయకులుగా ఎదిగి ప్రజా సేవలో తరించి ఆదర్శ రాజకీయాలకు స్ఫూర్తిగానిలుస్తారు. రాజకీయసైద్ధాంతికనాయకత్వమున్న ప్రజా ప్రతినిధులు తయారవుతారు రాజ్యాంగ లక్ష్యాల సాధనకు అవసరమైన పరిజ్ఞానాన్ని పుణికి పుచ్చు కుంటారు. ప్రభుత్వం కే 'జీ టు పి'జి వరకు రాజ్యాంగాన్ని కంపల్సరీపాఠ్యాంశంగాప్రవేశపెట్టాలి.

నేదునూరి కనకయ్య
తెలంగాణ ఎకనామిక్ ఫోరం అధ్యక్షులు
కరీంనగర్, సిరి టవర్స్
9440245771



# మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఘన విజయం ఖాయం

- బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ర్యాకల శేఖర్ గౌడ్

మనోహరాబాద్ (ప్రజాస్వరం) :



అమలు కానీ హామీలను ఇచ్చి కాంగ్రెస్ ప్రభుత్వం గద్దె నెక్కిందని పరిపాలన చేతకాకే ప్రజల దృష్టిని మరల్చడానికి బి ఆర్ ఎస్ నాయకుల పై తప్పుడు ఆరోపణలు చేస్తూ కేసులు పెట్టాలని చూస్తుందని కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికైనా ఇచ్చిన హామీలను నెరవేర్చాలని పార్టీ రాష్ట్ర నాయకులు ర్యాకల హేమలత శేఖర్ గౌడ్ పేర్కొన్నారు. ఆదివారం మనోహరాబాద్ మండల కేంద్రంలో పురం మహేష్ లతో కలిసి ఆయన మాట్లాడుతూ హరీష్ రావు, కేటీఆర్, ఆర్ ఎస్ ప్రవీణ్ కుమార్ లపై తప్పుడు కేసులు పెడుతూ విచారణ పేరుతో వేదిస్తుందని అవేదన వ్యక్తం చేశారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చే దానిపై దృష్టి పెట్టాలి కానీ ప్రతిపక్ష నాయకుల పై కేసులు పెట్టడం లాంటి చర్యలను మానుకోవాలని కేసులు పెట్టి మున్సిపల్ ఎన్నికలను గెలవాలనుకునే రేవంత్ రెడ్డికి ప్రజలు తగిన బుద్ధి చెబుతారని ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ మాయమాటలు నమ్మి కాంగ్రెస్ లో ఉన్న నాయకులు ఆ పార్టీని వదిలేసి బిఆర్ఎస్ పార్టీలో చేరుతున్నారన్నారు. ప్రజలు ఎవరు కాంగ్రెస్ పార్టీని నమ్మే పరిస్థితిలో లేరని 75% మున్సిపల్ లను బీ ఆర్ ఎస్ పార్టీ కైవసం చేసుకుని మున్సిపల్ ల పై జెండాలను ఎగురవిస్తామని ఆయన పేర్కొన్నారు. కాబోయే ఎంపిటిసి , జెడ్పిటిసి ఎన్నికలలో కూడా బిఆర్ఎస్ సత్తా చాటుతుందని రాష్ట్రంలోని అన్ని జెడ్పిటిసులను కూడా కైవసం చేసుకుంటామని ఆయన తెలిపారు. తిరిగి కెసిఆర్ పాలన ను తెచ్చుకోవడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని ఇప్పటికైనా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బోగస్ ప్రచారాలను మానేసి తెలంగాణ రాష్ట్రంలో కెసిఆర్ చూపిన బాటలో అభివృద్ధిని చేసి ప్రజలకు న్యాయం చేయాలి తప్ప ప్రతిపక్షాలపై బురద పూసే తప్పుడు ప్రచారాలను మానుకోవాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మండల పార్టీ అధ్యక్షులు పురం మహేశ్వర్ ముదిరాజ్, మనోహరాబాద్ గ్రామ కమిటీ అధ్యక్షులు మైపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


## చైతన్యబాటలో టీఆర్పీలోకి చేరికలు



తూప్రాన్, జనవరి 25 (ప్రజా స్వరం) :

మెదక్ జిల్లాలో తెలంగాణ రాజ్యాధికార పార్టీ మెదక్ జిల్లా అధ్యక్షులు హిమాం పూర్ యాదగిరి గౌడ్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న చైతన్యబాట కార్యక్రమంలో భాగంగా నార్సింగ్ మండలం భీమ్ రావు పల్లి గ్రామం, రామాయంపేట మండలం ఢీ ధర్మారం (ప్రగతి ధర్మారం) గ్రామాల నుంచి వివిధ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో టీఆర్పీలో చేరారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారికి టీఆర్పి జిల్లా నాయకులు పార్టీ కండువాలు కప్పి సాధారంగా స్వాగతించారు. పార్టీ చైతన్య బాట కార్యక్రమం ద్వారా పార్టీ సిద్ధాంతాలకు ఆకర్షితులై, గ్రామస్థులు టీఆర్పి లో చేరారు , ప్రజా సమస్యల పరిష్కారానికి పార్టీ తరపున నిరంతరం పోరాడుతామని ఆయన తెలిపారు.రామాయంపేట మండలం ధర్మారం గ్రామంలోని టీ పాయింట్ వద్ద టీఆర్పి నాయకులు గ్రామస్తులతో చర్చ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో రాష్ట్ర కార్యదర్శి బసాపురం నగేష్ ముదిరాజ్, మెదక్ జిల్లా అధ్యక్షులు ఇమాంపురం యాదగిరి గౌడ్, జిల్లా ఉపాధ్యక్షులు చంద్రశేఖర్, జిల్లా సోషల్ మీడియా అధ్యక్షులు కమలయ్య, సురేష్ ముదిరాజ్, చేగుంట మండల అధ్యక్షులు కంచర్ల సిద్దా గౌడ్, ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ ముదిరాజ్, జిల్లా కోశాధికారి మంకిడి రాములు ముదిరాజ్, అధికార ప్రతినిధి పగిడిమారి శేఖర్ నేత, జిల్లా యువత అధ్యక్షులు పోతుల రవీందర్, ఉపాధ్యక్షులు అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## చిత్తారమ్మ ఆలయ అభివృద్ధికి కృషి



- మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్

రామాయంపేట, జనవరి 25 ( ప్రజాస్వరం)

మెదక్ జిల్లా రామాయంపేట మండల కేంద్రంలోని చిత్తారమ్మ వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఆదివారం చిత్తరమ్మ వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా అమ్మవారి కళ్యాణ మహోత్సవం కన్నుల పండుగగా నిర్వహించారు. చిత్తరమ్మ వార్షిక బ్రహ్మోత్సవాల్లో మాజీ ఎమ్మెల్యే పద్మ దేవేందర్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు కంటారెడ్డి తిరుపతిరెడ్డి పాల్గొన్నారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ పల్లె జితేందర్ గౌడ్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ పుట్టి విజయలక్ష్మి యాదగిరి, మాజీ పిఏసిఎస్ చైర్మన్ బాదే చంద్రం, పుట్టి యాదగిరి, తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరు ఓటు హక్కు వినియోగించుకోవాలి

- తహసిల్దార్ గ్రేస్ బాయి

నార్సింగి, జనవరి 25 ( ప్రజా స్వరం ) :

18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు ఓటు హక్కును వినియోగించుకోవాలని నార్సింగ్ తహసిల్దార్ గ్రేస్ బాయ్ అన్నారు మెదక్ జిల్లా నార్సింగ్ మండల కేంద్రంలో 16వ జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా తహసిల్దార్ గ్రేస్ బాయ్, ఎస్సై సృజన, ఆర్ ఐ లు శ్రీధర్, మేఘన, సర్పంచ్ సుజాత మల్లేశం గౌడ్, బి ఎల్ వో లు రేషన్ డీలర్లు, విద్యార్థులు అందరూ కలిసి తాసిల్దార్ కార్యాలయం నుండి పాఠశాల వరకు ర్యాలీ నిర్వహించి ప్రజలకు ఓటు హక్కు పై అవగాహన కల్పించారు. అనంతరం తాసిల్దార్ కార్యాలయం వద్ద బి ఎల్ ఓ లకు సర్టిఫికెట్ పెన్ను ప్రధానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ఓటు హక్కును వినియోగించుకోవాలని ఓటును అమ్ముకోకుండా ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా ఓటు హక్కును వినియోగించుకోవాలని, ఓటు హక్కు వజ్రాయుధమని వరన్నారు.



## బీజేపీ కార్యాలయం ప్రారంభం



జవహర్ నగర్, జనవరి 25, (ప్రజాస్వరం) :

జవహర్ నగర్ డివిజన్ బిజెపి పశ్చిమ శాఖ ప్రధాన కార్యదర్శి వేపుల సన్నీ బృందావనం కాలనీ లో ఏర్పాటు చేసిన నూతన భారతీయ జనతా పార్టీ కార్యాలయాన్ని ఆదివారం మేడ్చల్ రూరల్ జిల్లా బీజేపీ జిల్లా అధ్యక్షుడు బుద్ధి శ్రీనివాస్,మాజీ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులు కొంపెల్లి మోహన్ రెడ్డి ప్రారంభించారు. బాలాజీ నగర్ శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయం చైర్మన్ కుతాడి శ్రీనివాస్ హాజరై శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, బృందావనం కాలనీతో పాటు జవహర్ నగర్ పరిసర ప్రాంతాల్లో భారతీయ జనతా పార్టీని మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా ఈ కార్యాలయం ఉపయోగపడుతుందని అన్నారు .ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు సంతోష్ గుప్తా వేపుల సన్నీ, గిరి, కత్తుల వెంకన్న డాక్టర్ యాదగిరి, మల్లికార్జున్ గౌడ్ ,రఘురాం చారి, అనిల్ గుప్తా, కర్లపూడి జోగారావు, మాజీ కార్పొరేట్ పానుగంటి బాబు మహేశ్వరి గౌడ్, లలిత, లిఖిత యాదవ్, రాము నాయక్, సందీప్ ముదిరాజ్, పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీలో చేరిన బీజేపీ నాయకులు

- సర్పంచ్‌కి సన్మానం చేసిన కనకయ్య, శ్రీకాంత్

గజ్వేల్ జనవరి 25 (ప్రజాస్వరం) :

సిద్దిపేట జిల్లా గజ్వేల్ మండలం అక్కరం గ్రామంలో బీజేపీ నాయకులు ఆదివారం గ్రామ సర్పంచ్ గౌలికర్ శ్రీవాణి హన్మంతు సమక్షంలో గ్రామానికి చెందిన బీజేపీ నాయకులు బూడిగే కనకయ్య, శ్రీకాంత్ కాంగ్రెస్ పార్టీలో చేరారు.ఈ సందర్భంగా సర్పంచ్ వారికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రజలకు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు అకర్షితులై పార్టీలో చేరుతున్నారని పార్టీలో చేరే వారికి అన్ని విధాలా అండగా ఉండి గ్రామ అభివృద్ధికి నిరంతరం పాటుపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బూడిగే స్వామి, ఎల్లం, నరసింహులు,వార్డు మెంబర్ లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.




EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY PURAM MAHESHWAR PRINTED AT HARI HARA ART PRINTERS, H.NO. 6-185, TOOPRAN, DIST. MEDAK, TELANGANA-502336. AND PUBLISHED AT H.NO. 4-50/18, KALLAKAL, VILL-KALLAKAL,(PO), KALLAKAL, (M) MANOHARABAD, DIST, MEDAK, TELANGANA-502336,
EDITOR : PURAM MAHESHWAR. RNI NO : TELTEL/2006/17154, CELL : 8008609999